


టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా



గెలిచాం : విజేత గోపీమూర్తి

- సీపీఎస్ రద్దుకు కృషి
- మండలిలో గళమెత్తుతా
- ఎమ్మెల్సీ గోపీమూర్తి

కలెక్టరేట్ (కాకినాడ)/కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో గళమెత్తి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారంకాని సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు అప్పగించే పనుల కారణంగా పాఠ్యాంశాలు బోధించడంలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు హెల్త్‌కార్డులు జారీచేయాలని కోరతానన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు శాసనమండలిలో గళమెత్తుతానన్నారు. ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మినిమం స్కేల్ ప్రకారం జీతాలిచ్చే విధంగా ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇతర అభ్యర్థి ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ఉపాధ్యాయులు వాటిని అధిగమించి తనను గెలిపించారన్నారు. ఈమేరకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఎమ్మెల్సీ గోపీమూర్తి పేర్కొన్నారు.

మూర్తీభవించిన.. విజయం

ఎమ్మెల్సీ విజేత గోపిమూర్తి



మనదే విక్టరీ : ఆనందంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజేత గోపీమూర్తి అభివాదం

కాకినాడ/కాకినాడకలెక్టరేట్/కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతా ఊహించినట్టే జరిగింది. ఓట్ల లెక్కింపు అంతా వార్ వన్‌సైడ్ తరహా అయింది. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి స్పష్టమైన ఆధిక్యతతో దూసుకుపోయారు. దీంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపిమూర్తి 9,165 ఓట్లతో విజయ కేతనం ఎగురవేశారు. కాకినాడ జేఎన్టీయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లైబ్రరీలో సోమవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమైంది. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సమక్షంలో అధికారులు బ్యాలెట్ బాక్సులు తెరిచి ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు. యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థి గోపిమూర్తి గెలుపొందడంతో ఇటు ఉపాధ్యాయ సంఘాలు, అటు బలపర్చిన ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.దీంతో జేఎన్‌టీయూ ఉపాధ్యాయులతో కోలాహలంగా మారింది.

ఆది నుంచీ ఆధిక్యత..



గోపిమూర్తికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న కలెక్టర్

మొత్తం 14 టేబుళ్లపై 76 మంది ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ పత్రాలు లెక్కించారు. ప్రతి 50 ఓట్లను కట్టలుగా విభజించి కౌంటింగ్‌కు సిద్ధంచేశారు. ప్రాధాన్య ఓట్ల ప్రకారం ఎవరికి ఎన్ని వచ్చాయో ఏజెంట్ల సమక్షంలో లెక్కించారు. ఈనెల 5న జరిగిన ఉప ఎన్నికల్లో మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 15,494 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో భాగంగా 814 ఓట్లు చెల్లనివిగా నిర్ధారణ అయ్యాయి. ఇవి పోను మిగిలిన 14,680 ఓట్లు లెక్కించగా యూటీఎఫ్ బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి 9,165 ఓట్లు లభించాయి. ఓట్ల లెక్కింపు దగ్గర నుంచి చివరి వరకు పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి ఆధిక్యత కనబర్చారు. మరో అభ్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు లభించడంతో రెండో స్థానంలో నిలిచారు. నారాయణరావు ఒక దశలో కొంత వరకు పోటీ ఇచ్చారు. దీంతో కాసేపు విజయంపై ఉత్కంఠ కొనసాగింది. కానీ కాసేపటికే గోపిమూర్తికి ఆధిక్యత పెరిగి విజయం ఏకపక్షమైంది. మిగిలిన అభ్యర్థుల్లో దీపక్ పులుగు 102, నామన వెంకటలక్ష్మి 81, డాక్టరు కవల నాగేశ్వరరావు 73 ఓట్లతో ప్రభావం చూపలేకపోయారు. చెల్లిన ఓట్ల ఆధారంగా విజయం సాధించడానికి 7,341 ఓట్లు రావాల్సి ఉండగా పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి 9,165 ఓట్లు కైవసం చేసుకున్నారు.ఎన్నికల కమిషన్ ఆమోదంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఆయన గెలుపొందినట్టు ప్రకటించి ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



కౌంటింగ్ సాగిందిలా : 14 టేబుళ్లపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

- 9,165 ఓట్లతో జయకేతనం
- తొలి నుంచీ స్పష్టమైన ఆధిక్యత
- ఏకపక్షంగా సాగిన ఫలితం
- కౌంటింగ్ కేంద్రం వద్ద సంబరం
- మొత్తం పోలైన ఓట్లు 15,494
- చెల్లనివి 814.. లెక్కింపు 14,680
- రెండో స్థానంలో నారాయణరావు

ఈ టీచర్లకు ఓటేయడం రాదా..!

కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా అధికారులు కొన్ని ఓట్లు చూసి అవాక్కయ్యారు. నిర్దేశిత నమూనాలో కాకుండా చాలామంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు తప్పుగా వినియోగించుకోవడం చూసి విస్తుపోయారు. మొత్తం 814 ఓట్లు చెల్లకపోవడంతో వాటన్నింటినీ పక్కన పెట్టేశారు. వాస్తవానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులకు ఓటర్లు ప్రాధాన్యత క్రమంలో టిక్ పెట్టి ఓట్లు వేయాలి. కానీ చాలామంది అభ్యర్థి ఎదురుగా కాకుండా ఎగుడు దిగుడులో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయా సంఘాలు ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు శిక్షణ ఇచ్చారు. అయినా చెల్లని ఓట్లు భారీగా పడడం విశేషం.



ఏజెంట్లకు చెల్లని ఓట్లను చూపుతున్న సిబ్బంది



సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్‌లో 178 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ మీకోసం లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి 178 అర్జీలు స్వీకరించారు. ప్రజలు అందజేసే అర్జీల్లో అత్యధిక శాతం మండస్థాయిలోనే పరిష్కారం లభిస్తుందని..ఇక్కడ వరకూ రావాల్సిన అవసరం లేదని సూచించారు.ఆన్‌లైన్ ద్వారా 171, ఆఫ్‌లైన్ ద్వారా 7 అర్జీలు స్వీకరించామన్నారు. ఈనెల 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుందన్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు తెలియజేసి ప్రారంభోత్సవాలకు ఆహ్వానించాలన్నారు. రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టమ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ప్రజల నుంచి 28 అర్జీలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు,డీఆర్‌వో టి.సీతారామమూర్తి, అడిషనల్ ఎస్పీలు అల్లూరి వెంకటసుబ్బరాజు, ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఎల్.అర్జున్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆధార్ నమోదు

కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం సేవలు ప్రారంభించారు. ఆధార్ నమోదు,చిరునామా, మార్పులు, ఫోన్ నెంబరు చేర్పు, తదితర సేవలు ప్రారంభించారు.

ఆగని ఇసుక అక్రమాలు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక అక్రమాలు ఆగడం లేదు. ఒక పక్క సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక విధానం పగడ్బందీగా అమలు చేయాలని చెబుతున్నారు.అయితే కొందరు అధికార కూటమి నేతల అండతో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అఖండ గోదావరిలో బోట్స్‌మన్ సొసైటీల పేరిట ఇసుక దోపిడీ జరుగుతోంది.బ్రిడ్జిల సమీపంలో ఇసుక తవ్వేస్తున్నారు. దీని వల్ల బ్రిడ్జిల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనే హెచ్చరికలు బేఖాతర్ చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి కొవ్వూరు వైపు 10, రాజమహేంద్రవరం వైపు దోబీఘాట్ వద్ద 8 మొత్తం 18 బోట్లు సోమవారం సీజ్ చేశారు.పలువురు బోట్స్‌మన్ సొసైటీ నిర్వాహకులపై కేసులకు సిద్ధమవుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు.ప్రతి ర్యాంపులోనూ 24 గంటలూ పనిచేసే సేలా సీసీ కెమెరాలతో నిఘా, పర్యవేక్షణ పెట్టా మన్నారు.ఇప్పటికే పనిచేయని సుమా రు 30 వరకూ బోట్స్‌మన్ సొసైటీలను రద్దు చేసినట్టు చెప్పారు.బ్రిడ్జిల ప్రక్కన ఇసుక తీస్తున్న బోట్లు స్వాధీనం చేసుకు న్నామని క్రిమినల్ కేసులు పెడతామన్నారు.

\- కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరులో 10 బోట్లు సీజ్

కొవ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టాస్క్‌ఫోర్సు బృందం సోమవారం కొవ్వూరు ఏరినమ్మఘాట్ ఎదురుగా రోడ్డు కం రైలు వంతెనకు అతి సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టిన 10 బోట్లను సీజ్‌చేసి కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి తరలించినట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు. సీజ్ చేసిన బోట్లను పరిశీలించి బోటు యజమానులను విచారించారు. గోదావరిపై ఉన్న రోడ్డు కం రైలు బ్రిడ్జి, హేవ్‌లాక్ (పాత రైలు వంతెన) బ్రిడ్జి మధ్యలో, గామన్ బ్రిడ్జిలకు 500 మీటర్ల లోపు ఇసుక తవ్వకాలు ఎందుకు చేపట్టారని నిలదీశారు.వంతెనల వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టిన ఇసుక బోట్ల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని,సీజ్‌చేసిన ఇసుక స్వాధీనం చేసుకుని ప్రభుత్వ పనులకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు.వంతెనల సమీపంలో ఇసుక తవ్వడం నిషేధమని, ఎవరైన ధిక్కరిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కొన్ని బోట్స్‌మన్ సొసైటీలు వంతెనల సమీపం లో అక్రమంగా తవ్వుతున్నారన్నారు. బోటు యజమానులు మాట్లాడుతూ తెలియక తప్పు చేశామని మొదటి తప్పుగా భావించి విడిచిపెట్టాలని జేసీని కోరారు. జేసీ వెంట కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మైనింగ్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ కె.ఆనందబాబు,ఏజీఆర్ ఏఈ జి.మణికంఠరాజు, మైనింగ్ సర్వేయర్ పి.శ్రీనివాస్, ఏఎస్ఐ శ్రీనివాసరావు,పోలీసులు ఉన్నారు.

- బ్రిడ్జిల వద్ద ఇసుక తీత
- 18 బోట్లు సీజ్
- కొవ్వూరు వైపు 10
- రాజమండ్రి వైపు 8
- నిర్వాహకులపై ఆగ్రహం
- కేసుల నమోదుకు ఆదేశం
- నిబంధనలు మీరొద్దు : జేసీ



బోట్లు నిర్వాహకులతో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

కదులుతున్న భాస్కర్‌నగర్ భూమాయ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రూ.కోట్లాది విలువైన రాజమండ్రి పబ్లిక్ సర్వీస్ కోపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలాలు(భాస్కర్‌నగర్ లేవుట్) స్థలాల ఆక్రమాల పనిపట్టడానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నడుం బిగించారు. రాజకీయ నేతలు,రౌడీషీటర్ల అండతో ఇక్కడ భూములు అన్యాక్రాంతమైన విషయం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన సంగతి విదితమే.దీనిపై స్పందించిన కలెక్టర్ పి.ప్రశాంతి ఇప్పటికే ఇక్కడి పరిస్థితిపై కమిటీ వేసి ఒక నివేదిక కూడా రప్పించుకున్నారు.మొత్తం 278 పాట్లలో 103 ప్లాట్లను వెరిఫై చేశారు.సుమారు 155 ప్లాట్లు అన్యాక్రాంతమైనట్టు ప్రాథమిక అంచనా. వీటి రట్టు త్వరలోనే తేలిపోనుంది.ఇక్కడ అక్రమాలు వాస్తవాలని తేలడంతో వీటిని స్వాధీనం చేసుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.చట్టప్రకారం అర్హులకు న్యాయం చేయడానికి,రికార్డులేనివాటిని స్వాధీనం చేసుకోవడానికి నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.ఈ నేపథ్యంలో గవర్నమెంట్ ప్లీడర్ అభిప్రాయం కోరుతూ కలెక్టర్ ఇటీవల లేఖరాశారు.ఈలోపు సర్వే చేయడానికి నిర్ణయించి 20 మంది సర్వేయర్లను పురమాయించాలని కార్పొరేషన్ కమిషనర్‌కు లేఖ రాశారు.ఈ లేఖను జిల్లా సహకార శాఖ అధికారులు రెండు రోజుల కిందట కమిషనర్‌కు అందించినట్టు సమాచారం.

- 155 ప్లాట్లపై అనుమానాలు
- అక్రమాలు గుర్తింపునకు ఆదేశం
- సర్వేకు 20 మంది సర్వేయర్లు
- జేసీ,కమిషనర్‌తో కలెక్టర్ సమీక్ష

ఆక్రమణలు గుర్తించండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమణలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.తన కార్యాలయంలో సోమవారం జేసీ చిన్నరాముడు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో పట్టణప్రాంతాల్లో అన్యాక్రాంతమైన భూములపై సమీక్షించారు.రాజమహేంద్రవరంలో గోపాలనగర్ పుంత పట్టాలు, ఇందిరానగర్ 45వ డివిజన్‌లో ఇరిగేషన్ స్థలం పట్టాలు,46వ డివిజన్‌లో శానిటోరియం పట్టాలు, సర్వేనెంబరు 43/1,2, 47/1, 48/2లలో డంపింగ్ యార్డులకు చెందిన ఆక్రమణల గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ రికార్డులు పరిశీలించి భూమి వర్గీకరణతో కూడా సమగ్ర వివరాలు ఉండాలని సూచించారు. నిబంధనల ప్రకారం బండిదారి, కాళ్ల బాట ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఆక్రమణలను తొలగించడం ద్వారా అర్హులకు వేరే చోట స్థల కేటాయింపు చేయాలన్నారు. సమావేశంలో సిటీప్లానర్ ఆర్.కోటయ్య,ఏవో మహ్మద్ ఆలీ పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి/ఆలమూరు



పంటల సాగులో.. ఇక 'నానో' శకం!

భూమికి అపకారిగా మారిన ఎరువుల వాడకం తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతుల్లో భాగంగా 'నానో' లిక్విడ్‌ను తీసుకొచ్చారు. ఎరువులతో సమానంగా పనిచేసే నానో వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యవసాయ రంగంలో సాగు చేసే అన్ని రకాల పంటలకు నానో ఎంతగానో ఉపయోకరంగా ఉంటుందంటున్నారు. భారతదేశంలో ఎరువులు తయారు చేసే అన్ని కంపెనీలు ప్రస్తుతం ఈ నానో లిక్విడ్ తయారీపై దృష్టి పెట్టాయి. వీటి వాడకం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే వీలుంటుందని.. ముఖ్యంగా భూమికి ఎటువంటి ప్రమాదం ఉండదని వ్యవసాయాధికారులు ఇటీవల కాలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఎరువులకు బదులుగా నానో పెస్టిసైడ్ లిక్విడ్స్
- ఎరువులు వద్దు నానో ముద్దు అంటున్న శాస్త్రవేత్తలు
- భవిష్యత్ అంతా 'నానో'దే
- ఇంకా ఆసక్తి చూపని రైతులు

నానో లిక్విడ్.. ప్రయోజనాలెన్నో..

ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో లిక్విడ్‌ను ఉపయోగించడం వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. అలాగే ఉత్పత్తి పెంపుదలతోపాటు ఆదాయం పెరుగుతుంది. నేల, గాలి, నీరు కలుష్యాన్ని తగ్గిస్తుంది. తెగుళ్ల, వ్యాధులను తగ్గిస్తుంది. ఉత్పత్తి నాణ్యతను పెంచుతుంది. పూర్తిగా హాని చేయనిది. పంటలకు జీవులకు సురక్షితమైనది. నిల్వ చేయడం, రవాణా సులభతరం కావడంతో పాటు లాభదాయకంగా ఉంటుంది.

నానో వాడకం ఇలా..

కొంతకాలంగా మార్కెట్‌లో లభ్యమవుతున్న ఈ నానో ఎరువుల గురించి రైతు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎరువులతో పోల్చితే నానో వాడకం సులభతరంగా భావిస్తున్నారు. పైరు ఎదుగుదలకు వాడే ఎరువులకు బదులుగా వాడే ఈ నానో లిక్విడ్ ద్రవ రూపంలో లభ్యమవుతుంది. భూమిలో చల్లకుండా కేవలం పైరుపై పురుగుమందుల మాదిరిగానే పిచికారి చేస్తే ఎరువులు వేసిన దాని మంచి ప్రయోజనం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పిచికారీ చేయడం వల్ల భూమికి ఎటువంటి హాని చేయదు.

ఎరువులతో పోల్చితే అధిక లాభం..

ఎరువుల వాడకంతో పోల్చితే నానో వాడకం వల్ల అధిక లాభదాయంగా ఉంటుంది. ఉదాహరణకు ఎకరం భూమికి పంటను బట్టి డీఏపీ 50 నుంచి 75 కిలోలు వాడుతుంటారు. దీనివల్ల డీఏపీ 50కిలోల బస్తా రూ.1350కు మార్కెట్లో లభ్యమవుతోంది. దీనిని బట్టి చూస్తే దాదాపు ఎకరానికి రూ.రెండు వేల వరకు ఖర్చు. నానో 500 ఎంఎల్ బాటిల్ ఎకరానికి సరిపోతుంది. ఈ బాటిల్ ఖరీదు రూ.600. అంటే ఎంత తక్కువ ఖర్చో చూడండని రైతులకు అధికారులకు అవగాహన కల్పిస్తున్నారు.

రైతుల్లో ఆసక్తి అంతగా లేదు

కొత్తగా మార్కెట్లోకి వచ్చిన ఈ కొత్త నానో లిక్విడ్స్ పట్ల రైతులు ఆసక్తి చూపించడం లేదు. ఎరువుల వాడకానికి అలవాటు పడిన రైతులు లిక్విడ్‌ను వాడకం వల్ల పంట దిగుబడులు ఏవిధంగా ఉంటాయోనని భయపడుతున్నారు. దీంతో వీటిని వాడడానికి రైతులు వెనుకడుగు వేస్తున్నారు. అయితే సహకార సంఘాలు, ఎరువుల డీలర్లు రెండు బస్తాలు కావాలంటే ఒక బాటిల్ కొనాల్సిందేనని ఆంక్షలు పెడుతున్నారు. దీంతో కొంతమంది రైతులు కొనుగోలు చేసినప్పటికీ వాడకకుండా వదిలేస్తున్నారు.



భవిష్యత్ అంతా నానోదే..

భవిష్యత్ కాలంలో ఎరువులకు బదులుగా నానో లిక్విడ్ వాడకమే ఉంటుంది. ఎందుకంటే ఎరువులకంటే నానో సురక్షితం. అందుకే రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. నానో వాడకం వల్ల భూమికి ఎటువంటి హాని ఉండదు. పైగా పెట్టుబడి కూడా ఆదా అవుతుంది.

-కె.నాగేశ్వరరావు, ఏడీఏ, ఆలమూరు మండలం







గుడ్‌లక్ బేంబో.. ముచ్చటగా!



శుభాలనిచ్చే మొక్కలు ఎన్నో రూపాల్లో..

(ఆంధ్రజ్యోతి - కడియం)

నిత్యం ఆకుపచ్చగా అలరారే ఇండోర్ ప్లాంట్ రకం మొక్క. గుడ్‌లక్ బేంబో. కేవలం నీళ్లలోనే పెరిగే ఈ వెదురు జాతి మొక్క చైనాలో ఉత్పత్తి అవుతుంటాయి. వీటిని మన కడియం నర్సరీలకు దిగుమతి చేసుకుంటారు. రకరకాల ఆకారాల్లో ఈ మొక్క కొలువుదీరి అందరినీ కనువిందు చేస్తాయి. ఆకారం, పరిమాణాన్నిబట్టి గుడ్‌లక్ బేంబో ధర ఉంటుంది. అంటే రూ.500 నుంచి రూ.50 వేల దాకా. ఇది సూర్యరశ్మి వెలుతురు లేకుండానే చక్కగా నిగారింపుతో పెరిగే మొక్క. గుడ్‌లక్ బేంబో ఇంటిలో ఉంటే అంతా శుభం అనేది చైనీయుల విశ్వాసం. ఈ మొక్కను ఇంటిలో ఉంచుకుంటే శుభాలు కలుగుతాయని అందుకే 'గుడ్‌లక్' అని, వెదురు కాబట్టి 'బేంబో' అని, వెరసి గుడ్‌లక్ బేంబోగా, లక్కీ బేంబోగా పిలుస్తారు. ప్రతీ శుభకార్యానికి బహుమతులు బదులు మొక్కలు ఇవ్వడం ట్రెండ్‌గా మారింది. ఇటీవల ఈ మొక్కను పుట్టినరోజు, వివాహ వేడుకలు, నూతన సంవత్సరం, అధికారులు ఉన్నతాధికారులకు మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గుడ్‌లక్ బేంబో మొక్కను ఇండోర్ మొక్కగా షోకేజ్‌లు, టీపాయ్‌లు, అల్మారా, టీవీ స్టాండ్‌లు, బెడ్‌రూమ్‌లోను పెట్టుకోవచ్చు. సముద్రపు నీరు తగలకుండా స్వచ్ఛమైన నీటిని రెండు రోజులకొకసారి తగిన మోతాదులో పోసుకుంటే సరిపోతుంది. ప్రస్తుతం కడియం నర్సరీలో వివిధ ఆకృతుల్లో, వివిధ పరిమాణాల్లో గుడ్‌లక్ బేంబోలు రమణీయంగా దర్శనమిస్తున్నాయి.



ఆరోజు రానివారికి.. కబురు పంపండి!

- టీచర్ పేరెంట్స్ సమావేశానికి హాజరుకాని తల్లితండ్రులకు మళ్లీ పిలుపు
- విద్యార్థులతో చెప్పి రప్పించాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆదేశాలు
- ప్రోగ్రెస్ కార్డు ఇచ్చి.. విద్యార్థుల ఆరోగ్య అంశాలు నమోదు చేయాలని సూచన

మండపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్స్ మీట్ (పీటీఎం) విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా పిల్లల మార్కులతోపాటు వారి ఆరోగ్య వివరాలనూ తల్లిదండ్రులకు తెలియజేశారు. కానీ వివిధ కారణాలతో ఆరోజు సమావేశానికి కొందరు తల్లిదండ్రులు హాజరుకాలేదు. ఇలా హాజరుకాని తల్లిదండ్రులకు విద్యార్థుల ద్వారా కబురు పంపించి పాఠశాలకు పిలిపించి వారికి ప్రోగ్రెస్ కార్డు, విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలియపరచాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. అదేవిధంగా ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలు తప్పనిసరిగా హెల్త్‌కార్డులో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తాజాగా సూచించారు. పీటీఎం సమావేశం రోజున చాలా పాఠశాలల్లో 9, 10 తరగతి విద్యార్థులకు సంబంధించిన ఆరోగ్య వివరాలను మాత్రమే వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. మిగిలిన తరగతుల పిల్లల ఆరోగ్య విషయాలు నమోదు ఇంకా పూర్తికాలేదు. ఈనేపథ్యంలో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. దాంతో 9, 10 తరగతుల విద్యార్థులు మినహా మిగిలిన విద్యార్థుల వివరాలు ఇంకా హెల్త్‌కార్డులో పొందుపరచలేదని అధికారుల దృష్టికి వచ్చింది. వెంటనే ఆ విద్యార్థులు, వివరాలను హెల్త్‌కార్డులో నమోదు చేయించి వారి తల్లితండ్రులకు పిల్లల ఆరోగ్య సమాచారం తెలియపరచాలని హెచ్‌ఎంలను ప్రభుత్వం ఆదేశించింది.

ఆరోగ్య సమస్యలకు ఆదిలోనే చికిత్స

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో పిల్లలకు వైద్యపరీక్షలు చేసినా అవి చాలా పరిమితంగానే నిర్వహించారు. బాలికల్లో రక్తహీనత తెలుసుకోవడానికి ఎనీమియా పరీక్ష, బాలురకు గ్రహణంమొర్రి, చేతులు వంకరలు పోవడం వంటి వాటికి మాత్రమే పరీక్షలు నిర్వహించి, అందుకు సంబంధించిన వైద్య సేవలందించేవారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బాలబాలికలకు 22 రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యపరీక్షలు చేయించేలా చర్యలు తీసుకోవడంతోపాటు పేరెంట్స్‌కు పిల్లల ఆరోగ్య వివరాలు తెలియజేసేలా చర్యలు చేపట్టారు. దీనివల్ల వెంటనే ఆయా వ్యాధులకు సంబంధించిన వైద్యసేవలు పొందేందుకు వీలుకలుగుతుంది. ఈరకమైన స్క్రీనింగ్ పరీక్ష వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇక గత శనివారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి అన్ని జిల్లాల్లో సగటున 70 శాతం మేర హాజరు ఉందని అధికారులు అంచనా వేశారు. మిగిలిన 30 శాతం మంది పేరెంట్స్‌ను కూడా రానున్న వారం పది రోజుల్లో పాఠశాలలకు పిలిపించి విద్యార్థి సమక్షంలో విద్యార్థికి ఇప్పటివరకు వచ్చిన మార్కులు, బడికి హాజరుతోపాటు పిల్లల క్రమశిక్షణ, ఇతర వ్యాపకాల గురించి తెలియపరచాలని ప్రభుత్వం ఆదేశించింది. దీన్ని అన్ని పాఠశాలల్లో ఆచరించి మీటింగ్‌కు హాజరుకాని ప్రతి పేరెంట్‌కు హోలిస్టిక్‌కార్డుతోపాటు హెల్త్‌కార్డును చూపించి వారి వద్ద నుంచి ధ్రువీకరణ సంతకం తీసుకోవాలని ఆదేశాలు అందాయి. ఇదిలా ఉండగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1567 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు లక్ష మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి గురువారం, శనివారం రెండు రోజులపాటు పాఠశాల సమీపంలో ఉన్న పీహెచ్‌సీ, ఇతర ఆసుపత్రి వైద్యులు వచ్చి 22 రకాలు వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్ చేస్తున్నారు.

ఈ వివరాలను రాష్ట్రీయ బాల ఆరోగ్య సురక్ష జిల్లా అధికారులకు తొలుత వైద్యులు చెప్పి ఆ వివరాలను వైద్యరికార్డులో నమోదు చేస్తారు. పిల్లలకు దీర్ఘకాలిక వ్యాధులు ఏమైనా బయటపడితే వెంటనే జిల్లా ఆసుపత్రి లేదా బోధనాసుపత్రికి తల్లితండ్రులు తీసుకువెళ్లి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలి. ఎవరెవరికి ఏ ఆసుపత్రులకు పంపించిందనే వివరాలు పాఠశాల రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలి. ఏదైనా సమస్య వచ్చినపుడు ఈ రికార్డును ప్రమాణికంగా తీసుకుంటారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని పిల్లల హెల్త్ కార్డు వివరాలను ఎప్పటికపుడు అప్‌డేట్ చేసి ఉంచాల్సి ఉందని ఉపాధ్యాయవర్గాలు తెలిపాయి.



మండపేట సంఘం కాలనీ ఎంపీపీ పాఠశాలలో పేరెంట్, టీచర్ మీట్‌లో సందడి (ఫైల్‌ఫొటో)

పీటీఎం స్పందన బాగుంది..

పేరెంట్, టీచర్స్ సమావేశాలకు వచ్చిన స్పందన చాలా బాగుందని పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెబుతున్నారు. తల్లిదండ్రుల హాజరుశాతం కూడా బాగుందని, వారి పిల్లల ప్రతిభా వివరాలతో పాటు ఆరోగ్య సమస్యల వివరాలు అడిగి తెలుసుకోవడానికి ఎంతో ఆసక్తి చూపారని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఇలాంటి సమావేశాల వల్ల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రుల మధ్య సంబంధాలు పెరిగి, నిత్య పర్యవేక్షణ ద్వారా విద్యార్థుల భవితకు దోహదం చేస్తాయని పలువురు పలువురు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

- గో వధను సంపూర్ణంగా నిషేధించాలి: భారతీయ ధర్మ పరిషత్
- జిల్లాలవారీగా గోవుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- దేశవ్యాప్తంగా సనాతన హైందవ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ ధర్మ పరిషత్ సభ్యులు

జగ్గంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణ కోసం స్వామీజీలు స్థానిక సోమాలమ్మ తల్లి ఆలయం వద్ద నుంచి లయన్స్ క్లబ్ వరకు పాద యాత్ర నిర్వహించారు. అనంతరం భారతీయ ధర్మ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర ఆధ్వర్యంలో జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. జాతీయ అధ్యక్షుడు కృష్ణచరనంద భారతీస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల వారీగా గోవుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటిస్తూ గో వధను సంపూర్ణంగా నిషేధించాలని కోరారు. దేశవ్యాప్తంగా సనాతన హైందవ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలన్నారు. తిరుమలలో తక్షణం దేశవాళీ గోశాలలు, డెయిరీలు ఏర్పాటుచేసి స్వచ్ఛమైన నేతితో లడ్డూ ప్రసాదం శ్రీవారికి నైవేద్యంగా సమర్పించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకూ తిరుమల ప్రసాదం అందించే ఏర్పాటు చేయాలని త్వరలో టీటీడీ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు. సమావేశంలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ నాయకుడు తోట సర్వారాయుడు, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్యులు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు అభినంద స్వామి, స్కంద దేవానందగిరి స్వాములు, మాతా విద్యనందగిరి పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో హీరో అల్లరి నరేష్ పూజలు

అన్నవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి సినీహీరో అల్లరి నరేష్ సోమవారం విచ్చేశారు. ఆయనకు ప్రొటోకాల్ అధికారులు కొండలరావు, గంటా విష్ణు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. నరేష్‌తో సెల్ఫీలు దిగేందుకు భక్తులు ఆసక్తి కనబర్చారు. పెద్దింటి తలుపులయ్య తదితరులు పాల్గొన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం సినీహీరో అల్లరి నరేష్

తలుపులమ్మ సేవలో 'బచ్చలమల్లి' సినిమా టీం

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునికి చెందిన డైరెక్టర్ సుబ్బు తెరకెక్కించిన బచ్చల మల్లి సినిమా టీం సోమవారం తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకుంది, ఈ నెల 20న విడుదల కానున్న ఈ చిత్రం విజయవంతం కావాలని అమ్మవారిని మొక్కుకున్నట్టు సినీ నిర్మాత రాజేష్ దండా తెలిపారు. నటుడు అల్లరి నరేష్‌ను చూసేందుకు వచ్చిన వారితో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.



సినీ బృందాన్ని ఆశీర్వదిస్తున్న పండితులు

వినూత్నంగా 'బచ్చలమల్లి' సినిమా ప్రచారం

- తుని యువతతో క్రికెట్ ఆడిన సినిమా టీం
- విజేతలతో చిత్రంలోని ఒక పాట ఆవిష్కరణ
- ట్రాక్టర్ల పోటీలు నిర్వహించి బహుమతులు
- క్రికెట్ ఆడి మెప్పించిన హీరో అల్లరి నరేష్

తుని రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో బచ్చలమల్లి సినీ బృందం వినూత్న ప్రచారానికి తెరతీసింది. ఉదయం, మధ్యాహ్నం ట్రాక్టర్, క్రికెట్ పోటీలు నిర్వహించి సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేసింది. స్థానిక యువతతో సినీబృందం క్రికెట్ ఆడి విజేతలతో సినిమాలోని ఒక పాటను ఆవిష్కరింపజేశారు. ఈ చిత్ర హీరో అల్లరి నరేష్ బ్యాటింగ్ చేసి యువతతో కేరింతలు కొట్టించారు.

బచ్చలమల్లి చిత్ర బృందం సోమవారం తుని పట్టణంలో సందడి చేసింది. ఈ చిత్ర ప్రచారంలో భాగంగా తుని పట్టణానికి చెందిన టీంతో కలిసి క్రికెట్ ఆటాడింది. బచ్చలమల్లి మూవీ టీం ఏర్పాటు చేసిన ట్రాక్టర్ల పోటీ అభిమానులను ఆకట్టుకుంది. ఈ పోటీలు ముగిసిన తర్వాత సాయంత్రం తుని రాజా కళాశాల ప్రాంగణంలో సినిమా ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో బచ్చలమల్లి సినిమా నుంచి రచయిత పూర్ణాచారా రాసిన పాటను విజేతలైన తునికి చెందిన క్రికెట్ టీంతో ఆవిష్కరించారు. అనంతరం హీరో అల్లరి నరేష్ ట్రాక్టర్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఓ రైతుకు రూ.50వేల నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులను ఉద్దేశించి సినిమా హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ గోదావరి ప్రజల ఆత్మీయతా, అభిమానులు మరవలేనివన్నారు. తమ సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు అల్లరి నరేష్‌గా అభిమానిస్తున్న ప్రేక్షకులు ఈ సినిమాతో ఓ మంచి హీరో నరేష్‌గా తనను గుర్తిస్తారన్నారు. తుని ప్రాంతానికి చెందిన దర్శకుడు సుబ్బు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల నేపథ్య కథను ఎంపిక చేసుకుని తుని పరిసర ప్రాంతంతోపాటు గోదావరి జిల్లాల్లో ఎక్కువ శాతం షూటింగ్ చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూసి తనను ఆశీర్వదించాలని కోరారు. చిత్ర నిర్మాత రాజేష్ మాట్లాడుతూ సినిమా సూపర్ హిట్ కావడం ఖాయమని, పండుగ వాతావరణంలో సినిమా విజయోత్సవ వేడుక తునిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తుని పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులతోపాటు జగ్గంపేటకు చెందిన వీరాంజనేయ ఫిల్మ్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.





ట్రాక్టర్ల పోటీలో విజేతలకు చెక్ అందజేస్తున్న సినీ హీరో అల్లరి నరేష్, దర్శకుడు సుబ్బు

తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు

- తీవ్ర వాయుగుండం హెచ్చరికలతో తీరప్రాంతంలో మత్స్యకారుల అప్రమత్తం

కొత్తపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తాజాగా ఏర్పడిన తీవ్రవాయుగుండం హెచ్చరికలతో తీరప్రాంత ప్రజలు అప్రమత్తమయ్యారు. ఉప్పాడ-అమీనబాద్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న మినీ హార్బర్ సమీపంలో ఉన్న మాయాపట్నంలో గతంలో నిర్మించగా శిథిలమైన జియోట్యూబ్ టెక్నాలజీపైనుంచి సోమవారం అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ దగ్గర్లో ఉన్న పంటభూముల్లోకి దూసుకుపోతున్నాయి. ఉప్పాడ పాతబజారు, సూరాడపేట, రామిశెట్టిపేట, కొత్తపట్నంవద్ద రాకాసి అలలు మత్స్యకారుల ఇళ్లల్లోకి జొరబడుతున్నాయి. సుబ్బంపేట, విద్యుత్‌ప్లాంటు, బీచ్‌రోడ్డులో పెద్దవంతెన స్థానే నిర్మించిన అప్రోచ్ వంతెనపై నుంచి కెరటాలు ఎగసిపడుతున్నాయి. తీవ్రఅల్పపీడన హెచ్చరికలు జారీ చేయడంతో మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలకాలంలో రెండు, మూడు నెలల్లో సంభవించిన వరుస తుఫాన్‌లు, అల్పపీడనాలతో జీవనోపాధికి ఆటంకం ఏర్పడిందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



కొత్తపల్లి మండలం ఉప్పాడలోని మాయాపట్నంవద్ద జియోట్యూబ్ పైనుంచి పొలంలోకి చేరిన సముద్ర నీరు

తాడోపేడో తేల్చుకుంటాం

రాజమహేంద్రవరంలో ఎల్ఐసీ ఏజెంట్ల మహాధర్నా



మహాధర్నాలో ఐక్యత చాటుతున్న యూనియన్ నేతలు, ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టం కలిగించేవిధంగా నిర్ణయాలు తీసుకున్న జీవిత బీమా సంస్థ యాజమాన్య వైఖరిని నిరసిస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడి ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద లియాఫి(అఖిల భారత జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య) ఆధ్వర్యంలో మహా ధర్నా చేశారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ఏజెంట్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యూనియన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు రావుల మాధవరావు మాట్లాడుతూ దేశంలో 14 లక్షల మంది ఏజెంట్ల మనుగడకు నష్టం కలిగించే విధంగా యాజమాన్యం ప్రవర్తించడం సరికాదన్నారు. పాలసీదారుల ప్రయోజనాలకు ఇబ్బందులు వస్తాయన్నారు. ఎల్ఐసీ సెప్టెంబరు 30 వరకు అమల్లో ఉన్న పాలసీలన్నింటిని క్లోజ్ చేసి అక్టోబరు 1 నుంచి కొత్త పాలసీలను ప్రవేశ పెట్టారని.. అందులో ఏజెంట్లకు, కస్టమర్లకు ఇబ్బంది కలిగించే విషయాలను పొందుపర్చడం జరిగిందన్నారు. క్లా బ్యాక్ కమిషన్ స్ట్రెక్చర్‌ని మార్చడం, మినిమం బీమా మొత్తం రూ2 లక్షలకు పెంచడం, పాలసీల్లో వయోపరిమితిని తగ్గించడం, ప్రీమియం రేట్లు పెంచారని వాటన్నింటిని వ్యతిరేకిస్తున్నామన్నారు. తాడోపేడో తేల్చుకుంటామన్నారు. ఈసీ సభ్యుడు మస్తాన్ మాట్లాడుతూ తమ హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నామని త్వరలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. మహాధర్నాలో వంగా త్రిమూర్తులు, దొరబాబు, సాంబ మూర్తి, పిండి రెడ్డమ్మ, అరవింద్, వేమూరి శ్రీనివాస్, వీవీఎస్ కృష్ణారావు, గండిబోయిన శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం, తణుకు, కొవ్వూరు, పాలకొల్లు, రావులపాలెం, అమలాపురం, రాజోలు, కాకినాడ, పెద్దాపురం, రామచంద్రపురం, రాజమహేంద్రవరం, జంగారెడ్డిగూడెం నుంచి 3వేల ఏజెంట్లు పాల్గొన్నారు.

బురదకోటలో పెద్ద పులి

- లేగదూడను చంపి తిన్న పులి
- పాదముద్రల గుర్తింపు.. నిర్ధారించిన అటవీ అధికారులు
- భయాందోళనలో గిరిజన గ్రామాలు



పెద్దపులి అడుగుజాడలు, పులి దాడిలో మృతిచెందిన లేగదూడ

ప్రత్తిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో 2 రోజులుగా పెద్ద పులి సంచరిస్తోంది. బురదకోట పంచాయతీ పరిధిలోని బాపన్నదొర అటవీప్రాంతంలో లేగదూడపై దాడి చేసి చంపి తినేసింది. అటవీశాఖ అధికారులు సోమవారం పెద్దపులి సంచారంపై గాలింపు జరిపి దాని పాదముద్రలు గుర్తించడంతో పులి రాకను నిర్ధారించారు. బురదకోట చుట్టుపక్కల గిరిజన గ్రామాలను అప్రమత్తం చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చి సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో పశువులు, మేకలను అటవీ ప్రాంతంలో మేపడానికి తరలించవద్దని ఆదేశాలు ఇచ్చారు. జిల్లా అటవీ అధికారి డి.రవీంద్రనాధ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏలేశ్వరం ఫా రెస్ట్ రేంజర్ కె.దుర్గారాంప్రసాద్, డీఆర్వో ఎం. జాన్సన్, క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది పులి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బురదకోట, బాపన్నదొర, కె.మిర్చివాడ, కొండపల్లి, ఉలిగోగుల, అటవీ ప్రాంతంలో 6 ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేశారు. బురదకోట కేంద్రంగా రెండున్నర కిలోమీటర్ల దూరంలోని అటవీప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించామని ఫారెస్ట్ రేంజర్ కె.దుర్గారాంప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం నాటికి ట్రాప్ కెమెరాలకు పులి జాడ లభించలేదని చెప్పారు. పులి సంచరించిన ప్రదేశంలో పాదముద్రలను ల్యాబ్‌కు తరలించి అవి పులి పాదయాద్రలేనని నిర్ధారించడం జరిగిందని తెలిపారు. ఇది ఇలా ఉంటే బురద కోట అటవీ ప్రాంతంలో పులి సంచరించడం నిర్ధారణ కావడంతో ఒక్కసారిగా సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో భయాందోళన నెలకొన్నాయి. పశువులను, గొర్రెలను, మేకలను సమీప అడవుల్లోకి పంపవద్దని, ప్రజలు గుంపులు గుంపులుగా తిరగాలని, ఒంటరిగా ఎవరూ అటవీప్రాంతంలోకి వెళ్లవద్దని కరపత్రాలు ముద్రించి పంపిణీ చేశారు.

పులి ఎలా వచ్చింది?

బురద కోట అటవీప్రాంతానికి పులి రాకపై గిరిజనులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పాపికొండలు, రిజర్వ్ ఫారెస్ట్ నుంచి రాజవొమ్మంగి అటవీప్రాంతం గుండా ఏలేశ్వరం అటవీప్రాంతానికి చొరబడిందని పలువురు చెబుతున్నారు.



ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న ఫారెస్ట్ అధికారులు

శంఖారావ యుగళం దంపతులకు...

కామధేను జాతీయ పురస్కారం



హైదరాబాద్‌లో జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న నరసింహారావు దంపతులు

పి.గన్నవరం/రాజమహేంద్రవరం డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓంకార ప్రణవనాధాన్ని ధ్వనిస్తూ...అఖండ శంఖారావాన్ని పూరించడంలో జాతీయస్థాయిలో ఖ్యాతిని ఆర్జించి అనేక రికార్డులను, అవార్డులను, సువర్ణ ఘంటా కంకణాలు సాధించి అఖండ శంఖారావ యుగళంగా పేరు సాధించిన ఏపి ప్రత్యేక రక్షణదళం ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరానికి చెందిన డాక్టర్ కొండా నరసిం హారావు, అలివేలు మంగాదేవి దంపతులు మరో జాతీయ పురస్కారాన్ని (విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ కామదేను జాతీయ పురస్కారం) అందుకున్నారు. ఈ మేరకు ఈనెల 8వ తేదీన తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో అధ్యాత్మిక రంగం విభాగంలో ఆ సంస్థ సీఈవో సత్యవేలు రాంబాబు ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం జస్టిస్ నందా చేతులు మీదుగా ఆ దంపతులు అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ శంఖంపై ఉన్న ఎనలేని మక్కువతో 38 ఏళ్లుగా సొంత ఖర్చులతో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో 6 వేలకు పైగా కార్యక్రమాల్లో మేం శంఖారావం పూరించాం. జాతీయ పురస్కారాల అవార్డుల ప్రదానోత్సవం మా శంఖారావంతోనే ప్రారంభించడం సంతోషంగాఉంది అని పేర్కొన్నారు.



కార్యక్రమంలో శంఖాన్ని పూరిస్తున్న దృశ్యం

13 నుంచి నన్నయ వర్సిటీలో

అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో యూనివర్శిటీ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ కం విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు ఈనెల 13వ తేదీ నుంచి రెండురోజుల పాటు నిర్వహించనున్నట్టు ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్, క్రీడాబోర్డు కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ తెలిపారు. విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా ఈ పోటీలను క్యాంపస్‌లో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉభయగోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్‌లలో 24 ఈవెంట్స్ మహిళలకు, పురుషులకు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక చైర్మన్ కొండ్రు సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి చొల్లంగి వెంకటసుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

తాండవలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ శివారు రేఖవానిపాలెంలో కాలు జారి తాండవ నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం రెండు రోజుల తర్వాత కత్రావుల కొండ వద్ద పైకి తేలింది. మృతుడు రేఖవానిపాలెం గ్రామానికి చెందిన గెడ్డం సాయి (23)గా గుర్తించి తుని పట్టణ పోలీసులు శవ పంచనామాలు అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య, 3 నెలల బాబు, తల్లిదండ్రులు ఉన్నారు.

లైసెన్స్ లేకుండా రెస్టారెంట్

సీజ్ చేసిన అధికారులు

కపిలేశ్వరపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలో పంచాయతీ అనుమతి లేకుండా శ్రీ గణపతి రెస్టారెంట్ కొనసాగుతుంది. సోమవారం ఉదయం గ్రామస్తులు స్థానిక పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రెస్టారెంటు నిర్వహణపై కార్యదర్శి కె.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, వైద్యశాఖ అధికారులు సమక్షంలో రెస్టారెంట్‌ను తెరిపించి చూడగా ఫ్రిడ్జ్‌లో నిల్వ మాంసం, జాయింట్లు, బిర్యాని వంటిని ఉండటాన్ని గుర్తించారు. వాటిని బయటకుతీయించి నిర్వాహకుడు కె.గంగవరం మండలం ఎండగండికు చెందిన గంటి గణపతి నుంచి వివరాలు సేకరించారు. శ్యాంపిల్స్‌ను మెడికల్ సిబ్బంది సేకరించారు. అనంతరం నిల్వ ఉన్న మాంసం, బిర్యాని, తదితర వాటిని సిబ్బందితో భూమిలో పూడ్చిపెట్టారు. లైసెన్స్ లేని కారణంగా రెస్టారెంట్‌ను సీజ్ చేసినట్టు గ్రామ కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు.



టేకిలో రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కొలిమేరు టు కాకినాడ

● కదులుతున్న రేషన్ మాఫియా డొంక ● పట్టుబడిన 69 క్వింటాళ్లు ● పీడీఎస్ బియ్యం గుట్టురట్టు



కొలిమేరులో ఒక రైస్ మిల్లులో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరుగ్రామంలో పెద్ద ఎత్తున పట్టుబడుతున్న పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా గుట్టు రట్టు అవుతుంది. 2రోజులు క్రితం పంట పొలాల్లో ఓ పౌల్ట్రీలో పెద్ద ఎత్తున పట్టుబడిన పీడీఎస్ డంప్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. సంబంధిత బియ్యం వివరాల కోసం ల్యాబ్‌కు తరలించగా కాకినాడ పోర్టు కేంద్రంగా విదేశాలకు అక్రమ రవాణా అవుతున్న బియ్యం, కొలిమేరులో పట్టుబడిన బియ్యం ఒకే రకానికి చెందినవిగా రిపోర్టులు రావడం సంచలనం రేకెత్తించింది. దీంతో రెవెన్యూ అధికారులు మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేయగా కొలిమేరు గ్రామ శివారున ఓ వైసీపీ నాయకుడికి చెందిన రైస్ మిల్లులో పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టారు. దీంతో రైస్‌మిల్లులో తరలింపునకు సిద్ధంగా ఉన్న 69 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. సీజ్ చేసిన అధికారులు దీని వెనుక ఎవరు ఉన్నారనే కోణంలో ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మిల్లు నిర్వాహకులతో పాటుగా గొల్లప్రోలుకు చెందిన కొందరు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే రూరల్ పోలీస్‌స్టేషన్ కోళ్లఫారంలో పట్టుబడిన బియ్యానికి సంబంధించి గొల్లప్రోలుకు చెందిన ఒక వ్యక్తిపై కేసు నమోదైంది. దీని వెనుక ఎవరు ఉన్నారు?ఎంత కాలం నుంచి జరుగుతున్నందనే దానిపై వివరాలు సేకరిస్తున్నట్టు ఎంఎస్‌వో వి.రాజు చెప్పారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తాతారెడ్డి, వీఆర్వో తదితరులున్నారు.

గురజనాపల్లిలో ఉమ్మడి జిల్లా రగ్బీ జట్ల ఎంపిక



ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ బాలుర జట్టు



బాలికల జట్టు

కరప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి హైస్కూల్ క్రీడాప్రాంగణంలో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అండర్-15 సబ్‌జూనియర్ బాలురు, బాలికల రగ్బీ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. కరప, పిఠాపురం, కొమరగిరి, రామచంద్రపురం మండలాలకు చెందిన పలువురు క్రీడాకారులు ఈ ఎంపికల్లోపాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన బాలురు, బాలికలను ఎంపికచేసి ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15 నుంచి రెండు రోజుల బాటు గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్‌ఎం ఎం.సాయి మోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నాగలింగేశ్వరరావులు తెలిపారు. ఆయా జట్లకు ఎంపికైన క్రీడాకారులను అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమిడిశెట్టి నాగేంద్ర, లక్ష్మణ్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీవీ రమణమూర్తి, పద్మ, శేషుకుమారి, బొండా సతీష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.


బాలుర జట్టుకు ఎంపికైనవారు

డి.విజయకుమార్, వైవీఎస్ మణిదీప్, పి.వినయ్‌లోకేష్, కె.నాగవిష్ణు, వి.హేమంత్, ఎ.క్రాంతి, జె.గౌతమ్‌అజయ్‌కృష్ణ, కేఎంఎన్ సాగర్, అభిరామ్, డి.విజయ్‌కుమార్, జె.ప్రేమ్‌కుమార్, కేపి వలీషా, ఎ.గోవిందరాజు, జె.గౌతమ్.

బాలికల జట్టుకు ఎంపికైనవారు

వై.జ్యోతిచంద్రిక, ఎస్.వినీల, ఎన్.చాందిని, జి.తేజస్వీ, పి.వీరలత దివ్య, పి.శృతి, జి.మణిరాజేశ్వరి, టి.చంద్రకళ, కె.అమృత, పి.లోలాక్ష్యదేవి, డి.అలేఖ్య, ఎన్.దీపిక, కె.అఖిల, టి.వీరలక్ష్మి, పి.నిహారిక, బి.శిల్ప.

మహాసంస్థానంలో వైభవంగా లక్ష బిల్వార్చన



మహాసంస్థానంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న రుత్వికులు, పూజల అనంతరం ప్రత్యేక అలంకరణ

పిఠాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య రుత్విక్కుల బిల్వార్చన కార్యక్రమాలు జరిపించారు. అంతకుముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్టానము, అగ్నిప్రతిష్టాపన, దత్తమంత్ర హోమం, వివిధ హారతులు. స్వామికి పల్లకిసేవ నిర్వహించారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ ఈవో ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో దత్త జయంతి మహోత్సవాలు ప్రారంభం

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్ వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, రుత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్టానం, గురుచరిత్ర పారాయణ, వేదపారాయణ, గణపతి అథర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు జరిగాయి. సాయంత్రం అగ్నిప్రతిష్టాపన, దత్తమూల మంత్రహోమాదులు, సాయంత్రం సాయంకాల విశేష పుష్పార్చన, మంగళహారతి నిర్వహించారు. అనంతరం స్వయంభూ దత్తాత్రేయస్వామికి సహస్ర కలువ పుష్పార్చన నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి భవితకు పునాది అభ్యాసనం దిశానిర్దేశం

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం రాష్ట్ర కన్సల్టెంట్ బాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

దివాన్‌చెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి భవిష్యత్‌ను పునాది అభ్యాసనం దిశానిర్దేశం చేస్తుందని ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం రాష్ట్ర కన్సల్టెంట్ టి.బాలకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరు సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) 4వ దశ ఆరు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ 2030 నాటికి సాధించాల్సిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నాణ్యమైన విద్యను సాధించాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని నూతన జాతీయ విద్యావిధానం కుడా వివరిస్తుందన్నారు. పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం విద్యార్థి జీవితానికి బంగారు బాటలు వేస్తుందన్నారు. ప్రథమ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గీతారమ్య మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ముఖ్యంగా ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులన్నారు. శిక్షణా కార్యక్రమం కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ పునాది అభ్యసనం.. చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలను సూచిస్తుందని చెప్పారు. మూడేళ్ల నుంచి ఎనిమిది సంవత్సరాల వరకూ పాఠశాల విద్యావిధానంలో పునాదిస్థాయిగా పేర్కొన్నారు. నాలుగో బ్యాచ్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు ఆరు రోజుల పాటు శిక్షణ పొందనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఎంఈవోలు సీహెచ్‌వీ సోమిరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, కేఆర్పీలు ఈశ్వర్, కొండలరావు, గౌతమ్‌కృష్ణ ఎఫ్ఎల్ఎన్ ప్రాధాన్యతను వివరించారు. సమావేశంలో వెన్యూ ఆర్గనైజర్ పవన్, ప్రథమ్ కాకినాడ, కోనసీమ జిల్లా కోఆర్డినేటర్లు వంశీకృష్ణ, జీవన్, 17 మంది డీఆర్పీలు పాల్గొన్నారు.

వాడపల్లిలో సినీనటుడు శుభలేఖ సుధాకర్ పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో సినీనటుడు శుభలేఖ సుధాకర్

ఆత్రేయపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సినీనటుడు శుభలేఖ సుధాకర్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం అందుకున్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో సుధాకర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రూ.లక్ష విరాళం



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి బొమ్మూరుకు చెందిన ఎం.శివ, సత్యవతి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. వివిధ సేవల ద్వారా రూ.1,12,932 ఆదాయం లభించినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. హుండీలో సమర్పించిన కానుకల లెక్కింపు ఈనెల12తేదీన నిర్వహిస్తామన్నారు.

తిరునక్షత్ర ఉత్సవాలు ప్రారంభం



పల్లకీ మహోత్సవం



ఆళ్వార్‌కు అలంకరణ

ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న ఆళ్వార్ సన్నిధిలో తిరుమంగై యళ్వార్ తిరునక్షత్ర పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 5రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. తొలిరోజు ప్రకారోత్సవం, దవిడవేదపారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లునిర్వహించారు.

కొలిమేరులో టేకు దుంగలు పట్టివేత

తుని రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరు గ్రామంలో సోమవారం ఓ వైసీపీ ప్రజా ప్రతినిధికి చెందిన పొలంలో పెద్ద ఎత్తున టేకు దుంగలు పట్టుబడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా టేకు చెట్లను నరికి దుంగలు దాచడంపై భూ యజమానిపై చర్యలు చేపట్టనున్నట్టు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.



పట్టుబడిన టేకు దుంగలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ బీట్ అధికారులు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

» అన్ని విధాల యంత్రాంగం సిద్ధం » కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా రైతాంగం అప్రమత్తంగా ఉండాలని, కానీ ఆందోళన చెందనవసరం లేదని, అన్ని విధాల ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు ఆఫీసులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుతో కలసి కలెక్టర్ మాట్లాడారు. రైతు ధాన్యం తడిసిపోకుండా 10,100 టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి 2వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలోని 18మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 221 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2.3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటికే 2.03 లక్షల టన్నులు కొనుగోలు చేశామన్నారు. దానికి సంబంధించి 25,365మంది రైతులకు రూ.467.30 కోట్లు ఇవ్వవలసి ఉండగా, ఇప్పటికే 91శాతం మందికి 48గంటలలోపు రూ.420.63 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. మరో రూ.30 కోట్లు వరకూ జమ చేయడానికి సిద్ధంగా ఉందని, సుమారు 2కోట్ల వరకూ ఆధార్‌కార్డులు లింక్ కాకపోవడం తదితర సమస్యల వల్ల పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. మరో రెండు రోజుల్లో 10వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఇప్పటి వరకూ 54లక్షల గన్నీబ్యాగులు పీపీసీలకు అందజేశామని చెప్పారు.

ప్రభుత్వాసుపత్రిలో పరిస్థితులు

మార్చేందుకు కృషి: ఎమ్మెల్యే వాసు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకులు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధిని పట్టించుకోకుండా తమ జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యత ఇవ్వడంతో ఇక్కడ సమస్యలు రాజ్యమేలుతున్నాయని వాటన్నింటినీ పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ (బోధనాసుపత్రి)కి సోమవారం రూ.4 లక్షల విలువైన నాలుగు ఫ్రీజర్లను అందజేశారు. ప్రజావసరాలు తెలిసిన కూటమి ప్రభుత్వం జీజీహెచ్‌లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఆసుపత్రిని 15 రోజులకు ఒకసారి సందర్శిస్తూ ఇక్కడి సమస్యలు తెలుసుకుంటున్నానన్నారు. జీజీహెచ్ మార్చురీలో ఒకటే ఫ్రీజర్ ఉండగా.. దాతల సహకారంతో నాలుగు ఫ్రీజర్ బాక్సులు సమకూర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అత్తి సత్యనారాయణ, కాశి నవీన్‌కుమార్, తవ్వా రాజా, రెడ్డి మణేశ్వరరావు, మజ్జి రాంబాబు, బేసరి చిన్ని, అనూప్ జైన్, జీజీహెచ్ ఆర్ఎంవో ప్రణవ్ పాల్గొన్నారు.

'ఆదర్శ కమ్యూనిస్టు నారాయణస్వామి'

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ కేంద్ర నాయకుడు మాదాల నారాయణస్వామి ఆదర్శ కమ్యూనిస్టు, విప్లవ పోరాట యోధుడు అని ఆ పార్టీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా అన్నారు. రాజమహేంద్రవరం మావో భవన్‌లో సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నారాయణస్వామి 11వ వర్ధంతి సభ జరిగింది. ముందుగా నారాయణస్వామి చిత్రపటానికి టాన్యా, ఇతర నాయకులు నివాళులర్పించారు. ఈ సభలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నగర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి భీమశంకర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వి.చిట్టిబాబు, భానుప్రసాద్, సూరిబాబు, విజయ, అనసూయ పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

కోరుకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 16వ తేదీ నుంచి ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఉత్సవాలు 2025 జనవరి 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

'వైసీపీ' పేదలను మోసం చేసింది

» సీపీఐ జిల్లా కార్యదర్శి మధు
» సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మహిళల ధర్నా



ధర్నాలో పాల్గొన్న మధు, ఇతర నాయకులు, మహిళలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇల్లు లేని పేదలందరికీ వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మహిళలు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు అన్ని వార్డుల్లోనూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది కానీ ఎవరికీ ఇళ్ల స్థలాలు చూపించకుండా మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చే ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. నగరపాలక సంస్థ అధికారులకు ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం విచారణ చేసి వారందరికీ సంక్రాంతిలోగా స్థలాలు కేటాయించేలా రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని కోరారు. ప్రధాని మోదీ పాలనలో అదానీ అక్రమ వ్యాపారాలకు అంతేలేకుండా పోయిందని ఆరోపించారు. అదానీ గ్రూప్ అవినీతిపై పార్లమెంటరీ కమిటీ వేసి విచారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, కాకినాడ జిల్లా కార్యదర్శి బోడకొండ, నౌరోజీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ పుట్టినరోజు

కడియం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వీరవరంలోని జె.ఆశీర్వాదం చర్చిలో సోమవారం అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టినరోజు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ తాడాల కొండ్రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

'మార్గదర్శి భగవద్గీత'

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితానికి మార్గదర్శకత్వం కలిగించే జీవనమంత్రం భగవద్గీత అని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. ఈ నెల 11న గీతా జయంతి సందర్భంగా డాక్టర్ సాంబశివారెడ్డి హాస్పిటల్‌లో సోమవారం భగవద్గీతపై అవగాహన కల్పించారు. భారతీయ ఆధ్యాత్మిక సంపదలో భగవద్గీత ఒక అపార రత్నమని అన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఇన్‌చార్జి సునీత, సెక్రటరీ శ్రీలక్ష్మి, మాధవి, సిస్టర్స్ పాల్గొన్నారు.

ముగిసిన నృత్య కళాక్షేత్రం

వార్షికోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఆనం కళాకేంద్రంలో శివసాయి కూచిపూడి కళాక్షేత్రం వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా ఎంతో మంది చిన్నారులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్న కళా స్వాప్నిక సాయి మాధవిని పుర ప్రముఖులు, సత్కరించారు. అనేక మంది చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారులను రిటైర్డ్ జస్టిస్ వీఆర్.పాటిల్, సినీ హీరో రాంకీ, ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ.రాజారాం అభినందించారు.

ఎమ్మెల్సీగా గోపిమూర్తి

విజయంపై హర్షం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపి మూర్తి విజయం సాధించడం పట్ల టీచర్లు హర్షం వ్యక్తంచేశారు. యూటీఎఫ్ నాయకులు ఏపీటీఎఫ్ 1938 నాయకులకు స్వీట్లు పంచి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రవిబాబు, ప్రకాశరావు, జీవీ సుబ్బారావు, కేవీవీ సత్యనారాయణ, ఉదయబ్రహ్మం, అప్పయ్యశాస్త్రి, లివింగ్‌స్టన్ పాల్గొన్నారు.

రాజానగరానికి

ఐటీఐ కళాశాల మంజూరు

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



కోరుకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గానికి ఐటీఐ కళాశాల మంజూరయిందని ఈ మేరకు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి అధికారులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను కలిసి వివరాలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో డిగ్రీ, ఇంటర్, ఐటీఐ కళాశాల మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను కలిసి మాట్లాడానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన కృషి ఫలించి రాజానగరం నియోజకవర్గానికి ఐటీఐ కళాశాల మంజూరు చేస్తూ లోకేశ్ ఉత్తర్వులు జారీ చేశారు.

గృహనిర్మాణాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారు గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల ఓ ప్రకటనలో సూచించారు. గృహ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.2.77 లక్షలు అందజేయనుందని, వీటిలో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.1 లక్ష, ఉపాధి హామీ పథకం ద్వారా 90 పనిదినాలకు గాను రూ.27 వేలు అందజేయనున్నట్టు ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,100 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.1400 కోట్లు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్మోహనరెడ్డి దాదాపు రూ.3,500 కోట్లు విద్యార్థుల సొమ్ము విడుదల చేయలేదని విమర్శించారు. దీంతో చదువులు పూర్తయినా విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సుమన్‌కుమార్, సతీష్, మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచండి

మునిసిపల్ ఇంజనీరింగ్ ఔట్ సోర్సింగ్ వర్కర్ల నిరసన


రాజమహేంద్రవరంలో నిరసన తెలుపుతున్న మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఇంజనీరింగ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లకు టెక్నికల్ నాన్ టెక్నికల్ వారీగా జీతాలు పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు సోమవారం నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యాయలం వెలుపల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుబాబు, సహాయ కార్యదర్శి యేసయ్యరాజు లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు కనీస వేతనం చెల్లించకపోవడం వల్లన చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వేతనాలు టెక్నికల్ వర్కర్‌కు రూ.29,200, నాన్ టెక్నికల్ వర్కర్‌కు రూ.24,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పూర్తిస్థాయిలో నీటి సరఫరా, వీధిదీపాల సేవలు నిలుపుదల చేస్తామన్నారు. కార్యక్రమం మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కోటాని ముకుందరామ్, ఐ.నరసింహమూర్తి, సిరికి ప్రసాద్, పాలిక బాల భవాని తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు రాజ్యాంగంపై గౌరవం లేదు

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


తుమ్మలపల్లిలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న మండల ఇవాంజలిస్ట్, పాస్టర్ వెల్ఫేర్ సభ్యులు

అనపర్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల, భారత రాజ్యాంగం పట్ల వైసీపీ నేతలకు గౌరవం లేదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి రామవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా అనపర్తి వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటం పక్కన మాజీ ఎమ్మెల్యే మాజీ ముఖ్యమంత్రి ఫొటోలను పెద్దవిగా పెట్టడమే కాకుండా అంబేడ్కర్ చిత్రంపైన రాజన్న రాజ్యం, చిత్రం కింద భాగంలో వైసీపీ కార్యాలయమని రాయడం ఆయన్ను అవమానించడమేనని అన్నారు. దీనికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పి వివరణ ఇవ్వాలన్నారు. సమావేశంలో దళిత నాయకులు నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షమాగుణాన్ని చాటిన ఏసుక్రీస్తు

బిక్కవోలు: ప్రతి ఒక్కరూ క్షమాగుణం కలిగివుండాలని చాటి చెప్పిన వ్యక్తి ఏసుక్రీస్తు అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. తుమ్మలపల్లి సీసీఎల్ చర్చిలో సోమవారం మండల ఇవాంజలిస్ట్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ గ్రాండ్ క్రిస్మస్ ఆనంద కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచినా లౌకిక విధానానికి కట్టుబడి అన్ని కులాలు, మతాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను ఇవాంజలిస్ట్ పాస్టర్స్ సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తనుకు శ్రీధర్, సుబ్బారెడ్డి, రాఘవ, పాస్టర్స్ విజయరావు, సువర్ణరాజు, సమర్పణ్, విజయప్రసాద్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ నూతన కమిటీని సత్కరించిన ఎమ్మెల్యే

రంగంపేట: రంగంపేట మండలం కోటపాడు ఫిషర్‌మెన్ సొసైటీకి ఇటీవల జరిగిన ఎన్నికలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సోమవారం అనపర్తి మండలం రామవరంలో ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షులు కాపవరపు అప్పారావు,కార్యదర్శి దాసరి గోపి, సభ్యులు శేఖర్, బ్రహ్మాజీ, శ్రీను తదితరులను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గంగాధర్, అబ్బు, మురళి, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

దేవస్థానాల పేరుతో

విరాళాలు సేకరిస్తే చర్యలు

ధవళేశ్వరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలో దేవదాయ శాఖకు చెందిన దేవస్థానాలు, స్వామివార్ల పేరు చెప్పి విరాళాలు సేకరిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతామని కార్యనిర్వహణాధికారి కె.నాగసురేష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొందరు దేవుడు పేరిట వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి స్వామి, అమ్మవార్లకు నగలు చేయిస్తామని విరాళాలు సేకరిస్తున్నట్టు అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. దేవస్థానం రశీదు లేకుండా విరాళాలు ఇవ్వొద్దని భక్తులకు సూచించారు. వాట్సప్ గ్రూపులు లేదా భక్తుల ఇంటికి వెళ్ళి విరాళాలు సేకరించే వారిపై చర్యలు చేపట్టామని ప్రకటనలో తెలిపారు.

ధనుర్మాస ఉత్సవాలపై సమీక్ష

కోరుకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, రంగనాధ స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ధనుర్మాసం నిర్వహణకు సంబంధించి ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ బీవీ రమణ ఆలయ అర్చక స్వాములతో రంగరాజ భట్టర్ సమీక్ష జరిపారు. ధనుర్మాస ఏర్పాట్లపై చర్చించారు. ప్రస్తుతం రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం చర్యల్లో భాగంగా స్వామివారిని ఆలయం నుంచి వేరే చోటకు మార్చడం జరిగిందని ఆ ప్రదేశంలో షెడ్ ఏర్పాటు చేయడం కోసం పురావస్తు అధికారుల అనుమతి కోసం ప్రయత్నం చేయాలని నిర్ణయించారు. ధనుర్మాస ఉత్సవాల్లో ఎప్పటిల్లాగే విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చక స్వాములు, పెద్దింటి సత్తిబాబు, పెదపాటి గిరిధరా చార్యులు, వాడపల్లి నాగ ఆచార్యులు పాల్గొన్నారు.

భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మునిసిపల్ కాలనీ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. సోమవారం రాజమండ్రి జోన్ కు సంబంధించి ఏడు శాఖల నుంచి 400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. దీనికి అడిషనల్ ఎస్పీ చెంచిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. క్రీడా పతాకాన్ని ఏఎస్పీ ఆవిష్కరించి టార్చ్ వెలిగించారు. ఈ సందర్భంగా చెంచిరెడ్డి మాటాడారు. ఈ టోర్నమెంట్‌లో జూనియర్, సీనియర్ క్రికెట్ పోటీలలో గెలుపొందిన టీమ్‌లు గుంటూరులో జరిగే ఫైనల్స్ పోటీల్లో పాల్గొంటారని భాష్యం జోనల్ ఇంచార్జీ వి.ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల వితరణ


విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న దాత, పాఠశాల ఉపాధ్యాయులు

రాజానగరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగుబంద ప్రాథమికోన్నత పాఠశాలలోని ఇద్దరు విద్యార్థినులకు క్రియ సంస్థ (కాకినాడ), లయన్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ బాబు సోమవారం సైకిళ్లు బహూకరించారు. ఈసందర్భంగా ఎంఈవో జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ సైకిళ్లు స్వీకరించిన విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పెమ్మల భీష్మ నాగశ్రీ, యాళ్ల సాయిదేవిలకు మండల విద్యాశాఖాధికారి జ్యోతి ప్రసాద్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ సమక్షంలో దాత బాబు సైకిళ్లు అందజేశారు. ఉపాధ్యాయులు పవన్‌కుమార్, సుధీర్, సతీష్, సుబ్రహ్మణ్యం, డేవిడ్‌రాజు, వెంకటలక్ష్మి దాతలను అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ ఎంసీఎస్ నందు గతనెల 29న బీజెడ్‌ఏ-ఆర్‌జేవై ఎంప్టీరేక్‌లో గుర్తు తెలియని 50 ఏళ్ళ వ్యక్తి అపస్మారస్థితిలో పడి వున్నాడని అతన్ని జీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ చూసి 108కి కాల్ చేసి ఆసుపత్రికి తరలించారని జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశారు. మృతుడు వివరాలు తెలిసిన వారు జీఆర్పీ పోలీసులు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతుడు వివరాలు తెలిసిన వారు జీఆర్పీ సీఐ 9440627551, ఎస్ఐ 9491444022, స్టేషన్ నెంబరు 08332442821కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఈనెల 12 నుంచి జనవరి 8 వరకు

రెవెన్యూ సదస్సులు

బిక్కవోలు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 12 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు బిక్కవోలు తహశీల్దార్ సత్యకృష్ణ తెలిపారు. 12న ఇళ్లపల్లి, తుమ్మలపల్లి, రాళ్లఖండ్రిక, 16న రంగాపురం, 17న బలభద్రపురం, 18న తొస్సిపూడి, 20న కాపవరం, 23న ఆరికరేవుల, 26న మెళ్లూరు, 28న కొమరిపాలెం, 30న పందలపాక, జనవరి 2న కొంకుదురు, 4న ఊలపల్లి, 6న ఆర్ఎస్. పేట, 8న బిక్కవోలు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

తహశీల్దార్ లక్ష్మీలావణ్య

రాజానగరం: భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తలపెట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎస్.లక్ష్మీ లావణ్య కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి జనవరి 8 వరకు రాజానగరం మండలంలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. 12న ముక్కినాడ, 13న తోకాడ, 16న కానవరం, పల్లకడియం, 17న పాతతుంగపాడు, రాధేయపాలెం, కొత్తతుంగపాడు, 19న జి.యర్రంపాలెం, కొండగుంటూరు; 20న కొండగుంటూరు, సంపత్‌నగరం, 21న నామవరం, 23న భూపాలపట్నం, 26న శ్రీకృష్ణపట్నం, 27, 28న పాలచర్ల, లాలాచెరువు, దివాన్ చెరువు, 30న కలవచర్ల, సీతారాంపురం, జనవరి 3న వెలుగుబంద, చక్రద్వారబంధం, 4న జె.అగ్రహారం, వెంకటాపురం, 6న నరేంద్రపురం, 7న రాజానగరం, తూర్పుగోనగూడెం, పరిజెల్లిపేట, 8న నందరాడ గ్రామాల్లోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

దాళ్వాలో ప్రతి రైతు

క్రాప్ ఇన్సూరెన్స్ పొందాలి

అనపర్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దాళ్వా సాగుకు సంబంధించి ప్రతి రైతు క్రాప్ ఇన్సూరెన్స్ పొందే విధంగా వీఏఏ, వీహెచ్ ఏలు రైతులకు అవగాహన కల్పించాలని అనపర్తి వ్యవసాయ శాఖ డీడీ డీవీ కృష్ణ సూచించారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన వీఏఏ, వీహెచ్ఏల సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఎకరాకు ఎస్‌బీఐ ద్వారా క్రాప్ ఇన్సూరెన్స్‌కు రూ.630 చెల్లించి బీమా పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంఏవోలు బి.సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఎల్ఏఎల్‌వో నాని, ఏఈవో కిరణ్‌కుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కళా ఉత్సవ్‌లో కడియం విద్యార్థుల ప్రతిభ

కడియం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు డైట్‌లో నిర్వహించిన జాతీయ కళా ఉత్సవ్-2024లో మూడు విభాగాల్లో కడియం విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్టు హెచ్ఎం టి.సత్యనారాయణ తెలిపారు. వి.గాయత్రీ నాగదేవి (జానపద గేయం) ద్వితీయస్థానం, వై.సత్యసాయి మోహన పవిత్ర (జానపద నృత్యం) తృతీయస్థానం, షేక్ షరీన్ (వాయిద్య సంగీతం) తృతీయస్థానం, షేక్ అబ్దుల్‌రహీం (చిత్రలేఖనం)లో కన్సొలేషన్ బహుమతులు పొందినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణలను హెచ్ఎంతోపాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

గర్భిణులు మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి

సీతానగరం, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు మనసు ప్రశాంతంగా ఉంచుకుని విశ్రాంతి తీసుకుంటే ఆరోగ్య సమస్యలు రావని డాక్టర్ ఏసురాణి అన్నారు. సోమవారం ప్రధాన మంత్రి స్వాత్య మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన వైద్య శిబిరంలో ఆమె గర్భిణులను పరీక్షించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి, సీతానగరం శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వై.సుబ్బారాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్ వైజర్లు జి.వైవకృప, కె.సుధాకర్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

జాతీయ ఎస్సీ, మానవ హక్కుల

కమిషన్‌ను కలిసిన వైసీపీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ, మానవ హక్కుల కమిషన్‌ను వైసీపీ నాయకులు కలిసారు. వైసీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, మాజీ ఎంపీలు గురుమూర్తి, గోళ్లబాబురావు, పిల్లి సుభాష్ చంద్రబోస్, గోరంట్ల మాధవ్‌లు జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా, జాతీయ మానవ హక్కుల సంఘం లను కలిసి దళిత యువకుడు పులి సాగర్‌పై రాజమహేంద్రవరం పోలీసులు అమానవీయంగా ప్రవర్తించడంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైసీపీ సోమవారం ఒక ప్రకటన విడుదలచేసింది.

12న విద్యుత్ వినియోగదారుల


సమస్యల పరిష్కార వేదిక

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీర్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ఆరోజు ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ సాంకేతిక సభ్యులు ఎస్.మణి, షేక్ బాబర్ అందుబాటులో ఉండి వినియోగదారుల ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

వీల్‌చైర్స్ పంపిణీ


వీల్ చైర్స్ అందజేస్తున్న దృశ్యం

ధవళేశ్వరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు, అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో సోమవారం ట్రస్టు కార్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిపారు. దీనికి రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం ఎస్ఐ క్రాంతి కుమార్, ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరు దివ్యాంగులకు వీల్ చైర్స్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ ముత్యాల పోసికుమార్ టీడీపీ నాయకులు ఆళ్ళ ఆనందరావు, కె.భరత్, పి. రాజు, ఎస్.మాణిక్యాల రావు, వి. దుర్గ తదితరులు పాల్గొన్నారు.



గెలిచాం : విజేత గోపీమూర్తి

టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా

- సీపీఎస్ రద్దుకు కృషి
- మండలిలో గళమెత్తుతా
- ఎమ్మెల్సీ గోపీమూర్తి

కలెక్టరేట్ (కాకినాడ)/కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో గళమెత్తి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారంకాని సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు అప్పగించే పనుల కారణంగా పాఠ్యాంశాలు బోధించడంలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు హెల్త్‌కార్డులు జారీచేయాలని కోరతానన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు శాసనమండలిలో గళమెత్తుతానన్నారు. ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మినిమం స్కేల్ ప్రకారం జీతాలిచ్చే విధంగా ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇతర అభ్యర్థి ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ఉపాధ్యాయులు వాటిని అధిగమించి తనను గెలిపించారన్నారు. ఈమేరకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఎమ్మెల్సీ గోపీమూర్తి పేర్కొన్నారు.

మూర్తీభవించిన.. విజయం

ఎమ్మెల్సీ విజేత గోపీమూర్తి



మనదే విక్టరీ : ఆనందంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజేత గోపీమూర్తి అభివాదం

కాకినాడ/కాకినాడకలెక్టరేట్/కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతా ఊహించినట్టే జరిగింది. ఓట్ల లెక్కింపు అంతా వార్ వన్‌సైడ్ తరహా అయింది. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు పీడీఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి స్పష్టమైన ఆధిక్యతతో దూసుకుపోయారు. దీంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపీమూర్తి 9,165 ఓట్లతో విజయ కేతనం ఎగురవేశారు. కాకినాడ జేఎన్టీయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లైబ్రరీలో సోమవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమైంది. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సమక్షంలో అధికారులు బ్యాలెట్ బాక్సులు తెరిచి ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు. యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థి గోపీమూర్తి గెలుపొందడంతో ఇటు ఉపాధ్యాయ సంఘాలు, అటు బలపర్చిన ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.దీంతో జేఎన్‌టీయూ ఉపాధ్యాయులతో కోలాహలంగా మారింది.

ఆది నుంచీ ఆధిక్యత..



గోపీమూర్తికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న కలెక్టర్

మొత్తం 14 టేబుళ్లపై 76 మంది ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ పత్రాలు లెక్కించారు. ప్రతి 50 ఓట్లను కట్టలుగా విభజించి కౌంటింగ్‌కు సిద్ధంచేశారు. ప్రాధాన్య ఓట్ల ప్రకారం ఎవరికి ఎన్ని వచ్చాయో ఏజెంట్ల సమక్షంలో లెక్కించారు. ఈనెల 5న జరిగిన ఉప ఎన్నికల్లో మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 15,494 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో భాగంగా 814 ఓట్లు చెల్లనివిగా నిర్ధారణ అయ్యాయి. ఇవి పోను మిగిలిన 14,680 ఓట్లు లెక్కించగా యూటీఎఫ్ బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి 9,165 ఓట్లు లభించాయి. ఓట్ల లెక్కింపు దగ్గర నుంచి చివరి వరకు పీడీఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి ఆధిక్యత కనబర్చారు. మరో అభ్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు లభించడంతో రెండో స్థానంలో నిలిచారు. నారాయణరావు ఒక దశలో కొంత వరకు పోటీ ఇచ్చారు. దీంతో కాసేపు విజయంపై ఉత్కంఠ కొనసాగింది. కానీ కాసేపటికే గోపీమూర్తికి ఆధిక్యత పెరిగి విజయం ఏకపక్షమైంది. మిగిలిన అభ్యర్థుల్లో దీపక్ పులుగు 102, నామన వెంకటలక్ష్మి 81, డాక్టరు కవల నాగేశ్వరరావు 73 ఓట్లతో ప్రభావం చూపలేకపోయారు. చెల్లిన ఓట్ల ఆధారంగా విజయం సాధించడానికి 7,341 ఓట్లు రావాల్సి ఉండగా పీడీఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి 9,165 ఓట్లు కైవసం చేసుకున్నారు.ఎన్నికల కమిషన్ ఆమోదంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఆయన గెలుపొందినట్టు ప్రకటించి ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



కౌంటింగ్ సాగిందిలా : 14 టేబుళ్లపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

- 9,165 ఓట్లతో ఘన విజయం
- తొలి నుంచీ స్పష్టమైన ఆధిక్యత
- ఏకపక్షంగా సాగిన ఫలితం
- కౌంటింగ్ కేంద్రం వద్ద సంబరం
- మొత్తం పోలైన ఓట్లు 15,494
- చెల్లనివి 814.. లెక్కింపు 14,680
- రెండో స్థానంలో నారాయణరావు

ఈ టీచర్లకు ఓటేయడం రాదా..!

కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా అధికారులు కొన్ని ఓట్లు చూసి అవాక్కయ్యారు. నిర్దేశిత నమూనాలో కాకుండా చాలామంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు తప్పుగా వినియోగించుకోవడం చూసి విస్తుపోయారు. మొత్తం 814 ఓట్లు చెల్లకపోవడంతో వాటన్నింటినీ పక్కన పెట్టేశారు. వాస్తవానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులకు ఓటర్లు ప్రాధాన్యత క్రమంలో టిక్ పెట్టి ఓట్లు వేయాలి. కానీ చాలామంది అభ్యర్థి ఎదురుగా కాకుండా ఎగుడు దిగుడులో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయా సంఘాలు ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు శిక్షణ ఇచ్చారు. అయినా చెల్లని ఓట్లు భారీగా పడడం విశేషం.



ఏజెంట్లకు చెల్లని ఓట్లను చూపుతున్న సిబ్బంది



సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్‌లో 178 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ మీకోసం లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి 178 అర్జీలు స్వీకరించారు. ప్రజలు అందజేసే అర్జీల్లో అత్యధిక శాతం మండస్థాయిలోనే పరిష్కారం లభిస్తుందని..ఇక్కడ వరకూ రావాల్సిన అవసరం లేదని సూచించారు.ఆన్‌లైన్ ద్వారా 171, ఆఫ్‌లైన్ ద్వారా 7 అర్జీలు స్వీకరించామన్నారు. ఈనెల 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుందన్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు తెలియజేసి ప్రారంభోత్సవాలకు ఆహ్వానించాలన్నారు. రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టమ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ప్రజల నుంచి 28 అర్జీలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు,డీఆర్వో టి.సీతారామమూర్తి, అడిషనల్ ఎస్పీలు అల్లూరి వెంకటసుబ్బరాజు, ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఎల్.అర్జున్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆధార్ నమోదు

కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం సేవలు ప్రారంభించారు. ఆధార్ నమోదు,చిరునామా, మార్పులు, ఫోన్ నెంబరు చేర్పు, తదితర సేవలు ప్రారంభించారు.

ఆగని ఇసుక అక్రమాలు



- బ్రిడ్జిల వద్ద ఇసుక తీత
- 18 బోట్లు సీజ్
- కొవ్వూరు వైపు 10
- రాజమండ్రి వైపు 8
- నిర్వాహకులపై ఆగ్రహం
- కేసుల నమోదుకు ఆదేశం
- నిబంధనలు మీరొద్దు : జేసీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక అక్రమాలు ఆగడం లేదు. ఒక పక్క సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక విధానం పగడ్బందీగా అమలు చేయాలని చెబుతున్నారు.అయితే కొందరు అధికార కూటమి నేతల అండతో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అఖండ గోదావరిలో బోట్స్‌మన్ సొసైటీల పేరిట ఇసుక దోపిడీ జరుగుతోంది.బ్రిడ్జిల సమీపంలో ఇసుక తవ్వేస్తున్నారు. దీని వల్ల బ్రిడ్జిల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనే హెచ్చరికలు బేఖాతర్ చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి కొవ్వూరు వైపు 10, రాజమహేంద్రవరం వైపు దోబీఘాట్ వద్ద 8 మొత్తం 18 బోట్లు సోమవారం సీజ్ చేశారు.పలువురు బోట్స్‌మన్ సొసైటీ నిర్వాహకులపై కేసులకు సిద్ధమవుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు.ప్రతి ర్యాంపులోనూ 24 గంటలూ పనిచేసేలా సీసీ కెమెరాలతో నిఘా, పర్యవేక్షణ పెట్టామన్నారు.ఇప్పటికే పనిచేయని సుమారు 30 వరకూ బోట్స్‌మన్ సొసైటీలను రద్దు చేసినట్టు చెప్పారు.బ్రిడ్జిల ప్రక్కన ఇసుక తీస్తున్న బోట్లు స్వాధీనం చేసుకున్నామని క్రిమినల్ కేసులు పెడతామన్నారు.

\- కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరులో 10 బోట్లు సీజ్

కొవ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టాస్క్‌ఫోర్సు బృందం సోమవారం కొవ్వూరు ఏరినమ్మఘాట్ ఎదురుగా రోడ్డు కం రైలు వంతెనకు అతి సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టిన 10 బోట్లను సీజ్‌చేసి కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి తరలించినట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు. సీజ్ చేసిన బోట్లను పరిశీలించి బోటు యజమానులను విచారించారు. గోదావరిపై ఉన్న రోడ్డు కం రైలు బ్రిడ్జి, హేవ్‌లాక్ (పాత రైలు వంతెన) బ్రిడ్జి మధ్యలో, గామన్ బ్రిడ్జిలకు 500 మీటర్ల లోపు ఇసుక తవ్వకాలు ఎందుకు చేపట్టారని నిలదీశారు.వంతెనల వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టిన ఇసుక బోట్ల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని,సీజ్‌చేసిన ఇసుక స్వాధీనం చేసుకుని ప్రభుత్వ పనులకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు.వంతెనల సమీపంలో ఇసుక తవ్వడం నిషేధమని, ఎవరైన ధిక్కరిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కొన్ని బోట్స్‌మన్ సొసైటీలు వంతెనల సమీపం లో అక్రమంగా తవ్వుతున్నారన్నారు. బోటు యజమానులు మాట్లాడుతూ తెలియక తప్పు చేశామని మొదటి తప్పుగా భావించి విడిచిపెట్టాలని జేసీని కోరారు. జేసీ వెంట కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మైనింగ్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ కె.ఆనందబాబు,ఏజీఆర్ ఏఈ జి.మణికంఠరాజు, మైనింగ్ సర్వేయర్ పి.శ్రీనివాస్, ఏఎస్ఐ శ్రీనివాసరావు,పోలీసులు ఉన్నారు.



బోట్లు నిర్వాహకులతో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

కదులుతున్న భాస్కర్‌నగర్ భూమాయ

- 155 ప్లాట్లపై అనుమానాలు
- అక్రమాలు గుర్తింపునకు ఆదేశం
- సర్వేకు 20 మంది సర్వేయర్లు
- జేసీ,కమిషనర్‌తో కలెక్టర్ సమీక్ష

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రూ.కోట్లాది విలువైన రాజమండ్రి పబ్లిక్ సర్వీస్ కోపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలాలు(భాస్కర్‌నగర్ లేవుట్) స్థలాల ఆక్రమాల పనిపట్టడానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నడుం బిగించారు. రాజకీయ నేతలు,రౌడీషీటర్ల అండతో ఇక్కడ భూములు అన్యాక్రాంతమైన విషయం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన సంగతి విదితమే.దీనిపై స్పందించిన కలెక్టర్ పి.ప్రశాంతి ఇప్పటికే ఇక్కడి పరిస్థితిపై కమిటీ వేసి ఒక నివేదిక కూడా రప్పించుకున్నారు.మొత్తం 278 ప్లాట్లలో 103 ప్లాట్లను వెరిఫై చేశారు.సుమారు 155 ప్లాట్లు అన్యాక్రాంతమైనట్టు ప్రాథమిక అంచనా. వీటి రట్టు త్వరలోనే తేలిపోనుంది.ఇక్కడ అక్రమాలు వాస్తవాలని తేలడంతో వీటిని స్వాధీనం చేసుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.చట్టప్రకారం అర్హులకు న్యాయం చేయడానికి,రికార్డుల్లేనివాటిని స్వాధీనం చేసుకోవడానికి నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.ఈ నేపథ్యంలో గవర్నమెంట్ ప్లీడర్ అభిప్రాయం కోరుతూ కలెక్టర్ ఇటీవల లేఖరాశారు.ఈలోపు సర్వే చేయడానికి నిర్ణయించి 20 మంది సర్వేయర్లను పురమాయించాలని కార్పొరేషన్ కమిషనర్‌కు లేఖ రాశారు.ఈ లేఖను జిల్లా సహకార శాఖ అధికారులు రెండు రోజుల కిందట కమిషనర్‌కు అందించినట్టు సమాచారం.

ఆక్రమణలు గుర్తించండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమణలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.తన కార్యాలయంలో సోమవారం జేసీ చిన్నరాముడు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో పట్టణప్రాంతాల్లో అన్యాక్రాంతమైన భూములపై సమీక్షించారు.రాజమహేంద్రవరంలో గోపాలనగర్ పుంత పట్టాలు, ఇందిరానగర్ 45వ డివిజన్‌లో ఇరిగేషన్ స్థలం పట్టాలు,46వ డివిజన్‌లో శానిటోరియం పట్టాలు, సర్వేనెంబరు 43/1,2, 47/1, 48/2లలో డంపింగ్ యార్డులకు చెందిన ఆక్రమణల గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ రికార్డులు పరిశీలించి భూమి వర్గీకరణతో కూడా సమగ్ర వివరాలు ఉండాలని సూచించారు. నిబంధనల ప్రకారం బండిదారి, కాళ్ల బాట ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఆక్రమణలను తొలగించడం ద్వారా అర్హులకు వేరే చోట స్థల కేటాయింపు చేయాలన్నారు. సమావేశంలో సిటీప్లానర్ ఆర్.కోటయ్య,ఏవో మహ్మద్ అలీ పాల్గొన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

వాతావరణంలో మార్పులతో
పొగాకు మొక్కలకు తెగుళ్లు

గోపాలపురం పొగాకు బోర్డు అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన


చనిపోయిన పొగాకు మొక్కలు పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

గోపాలపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా పొగాకు మొక్కలు చనిపోతున్నాయని పలువురు రైతులు, బోర్డు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. నాటిన పొగాకు మొక్కలకు తెగుళ్లు సోకి చనిపోతున్నాయని రైతుల సమాచారంతో గోపాలపురం బోర్డు వేలం కేంద్రం నిర్వహణాధికారి అమల్దిశ్యామ్ తన సిబ్బందితో సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. బోర్డు అధికారులు రైతులతో కలిసి పలువురు రైతుల పొలాల్లో మొక్కలను పరిశీ లించారు. మొక్కలు ఎలా చనిపోతున్నాయో వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. నాటిన పొగాకు మొక్కలు ఒక్కసారిగా ఆకులు వాడిపోతున్నాయని, ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. అనంతరం సీటీఆర్ఐ శాస్త్రవేత్తలతో తీసుకోవల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. మంగళవారం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి తెగుళ్ల నివారణకు తీసుకోవల్సిన విధానాలను తెలియజేస్తారని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు దుగ్గిరాల రాంబాబు, సత్యనారాయణ, భాస్కరరావు, గోపాలం, ఉండవల్లి వీర్రాజు, సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గోపిమూర్తి గెలుపుపై హర్షం


గోపాలపురంలో స్వీట్లు పంచుతున్న యూటీఎఫ్ నాయకులు

చాగల్లు/గోపాలపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా యూటీఎఫ్ బలపరచిన అభ్యర్థి బొర్రా గోపిమూర్తి గెలుపు పట్ల యూటీఎఫ్, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. చాగల్లు, గోపాలపురంలో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస మర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే ఉద్యమ నాయకుడు ఎన్నికకావడం హర్షణీయమన్నారు. కార్యక్రమాల్లో చాగల్లులో రవివర్మ, రాధాకృష్ణ, కె.పోశమ్మ, ఆదాము, బుద్ధుడు, సుబ్బారావు, గోపాలపురంలో జాన్‌బాబు, జీ.వెంకటేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, వెంకటేష్, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి


ఆర్వోలతో మాట్లాడుతున్న తహశీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహశీల్దార్ అజయ్‌బాబు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే ప్రతీ సమస్యను యుద్ధ ప్రతిపాదికన పరిష్కరించేలా చూడాలన్నారు. అలాగే దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేలా వీఆర్వోలు చూడాలన్నారు. ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే సదస్సులు మండలంలోని అన్ని పంచాయతీల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్ పరామర్శ


పెరవలి: మల్లేశ్వరంలో మాజీ ఎంపీపీ మురళీ కృష్ణను పరామర్శిస్తున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం/పెరవలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ సోమవారం పరామర్శించారు. ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామానికి చెందిన ప్రగడ లక్ష్మీనారాయణ, కె.సావరం గ్రామానికి చెందిన మాదాసు నాగేంద్ర, వెలగదుర్రు గ్రామానికి చెందిన యాతం వెంకటేష్ కుటుంబాలను, పెరవలి మండలం ముక్కామల, అన్నవరప్పాడు, నల్లాకులవారిపాలెం తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టీడీపీ, జనసేన, నాయకుల కుటుంబ సభ్యులను మంత్రి దుర్గేష్ పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకున్న పెరవలి మాజీ ఎంపీపీ కోటిపల్లి మురళీకృష్ణను మంత్రి దుర్గేష్ ఆయన యింటి వద్ద కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వెంట మండల టీడీపీ పెరవలి అధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ (శ్రీను), జనసేన అధ్యక్షుడు పిప్పర రవి తదితరులున్నారు.

సుందరేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కొవ్వూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రకంలో సుందరేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.82,310 వచ్చిందని దేవదాయ, ధర్మాదాయశాఖ తాడేపల్లిగూడెం డివిజన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉదయబాబు నాయుడు తెలిపారు. సోమవారం భక్తుల సమక్షంలో సుందరేశ్వరస్వామి ఆలయ హుండీ తెరచి ఆదాయం లెక్కించామని, శివరాత్రి నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ఆలయ ఆదాయం లెక్కించగా రూ.82,310 వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాస శాస్త్రి, సుందర్ గణేష్, భక్తులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం


నిడదవోలులో సోనియాగాంధీ పుట్టినరోజు కార్యక్రమం

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పట్టణాధ్యక్షుడు మేడ వరపు భద్రందొర అన్నారు. సోమవారం నిడదవోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ అభివృద్ధి వైపు వెళతుంటే మన దేశం పేదరికం, నిరుద్యోగం వైపు ప్రయాణం చేస్తోందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, కారింకి వెంకటేశ్వరరావు, జీవీ సత్యనారాయణ, షేక్ ఖాసీమ్, మహమ్మద్ అన్వర్‌ఖాన్, శారద పాల్గొన్నారు.

రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం



కొవ్వూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, చాగల్లు రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు నిడదవోలు రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 8వ తేదీ రాత్రి 9గంటల సమయంలో చాగల్లు, కొవ్వూరు రైల్వేస్టేషన్ల మధ్య (విజయవాడ-విశాఖపట్నం వైపు) డౌన్‌లైన్ ట్రాక్ మధ్యన గుర్తుతెలియని 40-45 ఏళ్ల వయసున్న పురుషుడి మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం గదిలో భద్రపర్చామన్నారు. మృతుడు ఒంటిపై లైట్ బ్లూ కలర్ షార్ట్, లైట్ బ్లూ కలర్ పొడవు చేతుల చొక్కా ఉన్నాయని, చేతికి నలుపురంగు కాశీతాడు, మెడలో నలుపురంగు కాశీ త్రాడు దానికి వెండి రంగు తాయత్తు, కుడిచేతిపై ఈశ్వర్ అని తెలుగు అక్షరాల పచ్చబొట్టు, కుడిచేతి జబ్బమీద త్రిశూలం, నాగుపాము, డమరుకం గుర్తులు పచ్చబొట్టు ఉన్నాయన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94906 17090, 99480 10061 నెంబర్లకు సమాచారం అందజేయాలని ఆర్పీ హెచ్‌సీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు

గోపాలపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 9వ తేదీన స్కూటీపై ప్రయాణిస్తున్న తల్లి నవలం గన్నమ్మ(75), కూతురు కురసాని కాంతమ్మ(45) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ ఘటనపై గన్నమ్మ కొడుకు గంగరాజు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

పారా లీగల్ వలంటీర్లకు
దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు కోర్టు పరిధిలోని మండలాల నుంచి న్యాయ సేవా సహాయకులుగా (పారా లీగల్ వలంటీర్లు) పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ తెలిపారు. దరఖాస్తుదారులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. రిటైర్డ్ టీచర్లు, లెక్చరర్‌లు, సీనియర్ సిటిజన్స్, సోషల్ వర్కర్స్, స్టూడెంట్స్, డ్వాక్రా మహిళా సంఘాల ప్రతినిధులు పారా లీగల్ వలంటీర్లుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జత చేసి, కొవ్వూరు కోర్టులో మండల లీగల్ సర్వీస్ కమిటీలో అందజేయాలన్నారు. దరఖాస్తు అందించడానికి ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉందన్నారు. వివరాలకు 08813-231188 నెంబరును సంప్రదించాలన్నారు. అనంతరం ఈ నెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో సోమవారం పోలీసులు, న్యాయవాదులతో జిల్లా జడ్జి ఎం.అనూరాధ, డీఎల్ఎస్ఏ సెక్రటరీ కె.రత్నప్రసాద్ సమావేశం నిర్వహించారు. రత్నప్రసాద్ పోలీస్టేషన్ల వారీగా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసులు రాజీకి గుర్తించారని పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అలాగే న్యాయవాదులతో సమావేశం నిర్వహించి జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా సహకరించాలని సూచించారు.సమావేశంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి జి.సాయికృష్ణ, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జేడీటీఎస్ దేవి, కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, సీఐలు, ఎస్ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

'మార్గదర్శి భగవద్గీత'

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితానికి మార్గదర్శకత్వం కలిగించే జీవనమంత్రం భగవద్గీత అని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. ఈ నెల 11న గీతా జయంతి సందర్భంగా డాక్టర్ సాంబశివారెడ్డి హాస్పిటల్‌లో సోమవారం భగవద్గీతపై అవగాహన కల్పించారు.

ముగిసిన నృత్య కళాక్షేత్రం
వార్షికోత్సవం



రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఆనం కళాకేంద్రంలో శివ సాయి కూచిపూడి కళాక్షేత్రం వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా ఎంతో మంది చిన్నారులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్న కళా స్థాపిక సాయి మాధవిని పుర ప్రముఖులు, సత్కరించారు. అనేక మంది చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారులను రిటైర్డ్ జస్టిస్ వీఆర్.పాటిల్, సినీ హీరో రాంకీ, ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ.రాజారాం అభినందించారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

పీజీఆర్ఎస్‌కు 5 అర్జీలు

కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో సుస్మిత

కొవ్వూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో స్వీకరించిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించి దరఖాస్తుదారులకు సత్వర న్యాయం అందజేయాలని ఆర్డీవో రాణి సుస్మిత అధికారులకు సూచించారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 5 ఫిర్యాదులు స్వీకరించామన్నారు. ప్రతి మండల కేంద్రంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ధర్నా


మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ జీతాలను విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం నిడదవో లులోని మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయ కులు మాట్లాడుతూ పురపాలక సంఘంలోని ఇంజనీరింగ్ విభాగ కార్మికుల వేతనాల పెంపుపై గత ప్రభుత్వంలో అంగీకరించిన మినిట్స్‌ను అమలుచేయాలన్నారు. మునిసిపాలిటీలో పనిచేసే కార్మికులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తూరుగోపు నాగేశ్వర రావు, బొచ్చా దుర్గాప్రసాద్, బొచ్చా ముద్దుకృష్ణ, బండారు రాంబాబు, కారింకి వెంకటేష్, బొరిశెట్టి నాగేశ్వరరావు, బంగారు శ్రీను పాల్గొన్నారు.

బాధితులకు మాజీ హోం మంత్రి
వనిత ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న తానేటి వనిత

నల్లజర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి మాజీ హోం మంత్రి తానేటి వనిత ఆర్థిక సాయం అందించారు. అనంతపల్లిలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన వెలగన్న దుర్గయ్య ఇల్లు దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబాన్ని సోమవారం తానేటి వనిత పరామర్శించి రూ.10 వేలు అందించారు. బాధితులకు ఆవాస్ యోజన ద్వారా నూతన గృహం సబ్సిడీతో నిర్మించి ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంకా జయలక్ష్మి, కారుమంచి రమేష్, వీవీ సుబ్రహ్మణ్యం, యజ్జవరపు లక్ష్మి, గాంధీ, సాంబాశివరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

తాళ్లపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజ్జరం గ్రామంలో ఇటీవల ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన వేములూరి భాగ్యం కుటుంబానికి ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు తన మిత్ర బృందంతో కలిసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో గండి రాంబాబు, దండమూడి శేషగిరి, పండు తదితరులు పాల్గొన్నారు.

12న విద్యుత్ వినియోగదారుల
సమస్యల పరిష్కార వేదిక

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీర్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఆరోజు ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ సాంకేతిక సభ్యులు ఎస్.మణి, షేక్ బాబర్ అందుబాటులో ఉండి వినియోగదారుల ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

రాజానగరానికి
ఐటీఐ కళాశాల మంజూరు

కోరుకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గానికి ఐటీఐ కళాశాల మంజూరయిందని ఈ మేరకు ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి అధికారులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను కలిసి వివరాలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో డిగ్రీ, ఇంటర్, ఐటీఐ కళాశాల మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను కలిసి మాట్లాడానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన కృషి ఫలించి రాజానగరం నియోజకవర్గానికి ఐటీఐ కళాశాల మంజూరు చేస్తూ లోకేశ్ ఉత్తర్వులు జారీ చేశారు.

గృహనిర్మాణాలకు
రిజిస్ట్రేషన్ చేయించుకోండి

సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారు గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల ఓ ప్రకటనలో సూచించారు. గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.77 లక్షలు అందజేయనుందని, వీటిలో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.1 లక్ష, ఉపాధి హామీ పథకం ద్వారా 90 పనిదినాలకు గాను రూ.27 వేలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

పునాది అభ్యాసనం భవిష్యత్‌కు దిశానిర్దేశం

» ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రకన్సల్టెంట్ బాలకృష్ణ

» నాలుగు జిల్లాల నుంచి ఉపాధ్యాయుల హాజరు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్సల్టెంట్ బాలకృష్ణ

దివాన్‌చెరువు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : పునాది అభ్యాసనం విద్యార్థి భవిష్యత్‌కు దిశానిర్దేశం చేస్తుందని ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం రాష్ట్ర కన్సల్టెంట్ టి.బాలకృష్ణ అన్నారు. రాజానగరం మండలం కొండగుంటూరు సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) 4వ దశ ఆరు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ 2030 నాటికి సాధించాల్సిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నాణ్యమైన విద్యను సాధించాల్సి ఉందని అన్నారు. ఇదే విషయాన్ని నూతన జాతీయ విద్యావిధానం కుడా వివరిస్తుందన్నారు. పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం విద్యార్థి జీవితానికి బంగారు బాటలు వేస్తుందన్నారు. ప్రథమ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గీతారమ్య మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ముఖ్యంగా ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులన్నారు. శిక్షణా కార్యక్రమం కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ పునాది అభ్యసనం.. చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలను సూచిస్తుందని చెప్పారు. మూడేళ్ల నుంచి ఎనిదేళ్ల వరకూ పాఠశాల విద్యావిధానంలో పునాదిస్థాయిగా పేర్కొన్నారు. నాలుగో బ్యాచ్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు ఆరు రోజుల పాటు శిక్షణ పొందనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఎంఈవోలు సీహెచ్‌వీ సోమిరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, కేఆర్పీలు ఈశ్వర్, కొండలరావు, గౌతమ్‌కృష్ణ ఎఫ్ఎల్ఎన్ ప్రాధాన్యతను వివరించారు.సమావేశంలో వెన్యూ ఆర్గనైజర్ పవన్, ప్రథమ్ కాకినాడ, కోనసీమ జిల్లా కోఆర్డినేటర్లు వంశీకృష్ణ, జీవన్, 17 మంది డీఆర్పీలు పాల్గొన్నారు.

'వైసీపీ' పేదలను మోసం చేసింది

» సీపీఐ జిల్లా కార్యదర్శి మధు

» సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మహిళల ధర్నా



ధర్నాలో పాల్గొన్న మధు, ఇతర నాయకులు, మహిళలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇల్లు లేని పేదలందరికీ వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మహిళలు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు అన్ని వార్డుల్లోనూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది కానీ ఎవరికీ ఇళ్ల స్థలాలు చూపించకుండా మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చే ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. నగరపాలక సంస్థ అధికారులకు ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం విచారణ చేసి వారందరికీ సంక్రాంతిలోగా స్థలాలు కేటాయించేలా రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని కోరారు. ప్రధాని మోదీ పాలనలో అదానీ అక్రమ వ్యాపారాలకు అంతేలేకుండా పోయిందని ఆరోపించారు. అదానీ గ్రూప్ అవినీతిపై పార్లమెంటరీ కమిటీ వేసి విచారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, కాకినాడ జిల్లా కార్యదర్శి బోడకొండ, నౌరోజీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా రైతాంగం అప్రమత్తంగా ఉండాలని, కానీ ఆందోళన చెందొద్దని, అన్ని విధాల ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు ఆఫీసులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుతో కలసి కలెక్టర్ మాట్లాడారు. రైతు ధాన్యం తడిసిపోకుండా 10,100 టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి 2వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలోని 18మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 221 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2.3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటికే 2.03 లక్షల టన్నులు కొనుగోలు చేశామన్నారు. దానికి సంబంధించి 25,365మంది రైతులకు రూ.467.30 కోట్లు ఇవ్వవలసి ఉండగా, ఇప్పటికే 91శాతం మందికి 48గంటలలోపు రూ.420.63 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. మరో రూ.30 కోట్లు వరకూ జమ చేయడానికి సిద్ధంగా ఉందని, సుమారు 2కోట్ల వరకూ ఆధార్‌కార్డులు లింక్ కాకపోవడం తదితర సమస్యల వల్ల పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. మరో రెండు రోజుల్లో 10వేల టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఇప్పటివరకూ 54లక్షల గన్నీ బ్యాగులు పీపీసీలకు అందజేశామని చెప్పారు.



ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

కొవ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కొవ్వూరు ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు పీఎస్ కిషోర్ ఆధ్వర్యంలో ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని నిరసన చేపట్టారు. అనంతరం రాజమహేంద్రవరంలోని డివిజనల్ కార్యాలయం వద్ద ఎల్ఐఏఎఫ్ (లైఫ్ ఇన్సూరెన్సు ఏజెంట్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో జరిగే మహాధర్నా కార్యక్రమానికి ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో కొవ్వూరు బ్రాంచి సెక్రటరి ఆకన శ్రీను, పి.పోసేష్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికల విద్యాభివృద్ధికే 'సంకల్ప్'


కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ షకీరాబేగం

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులంతా చదువులో మంచి ప్రతిభ చూపించి అత్యధిక మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కౌన్సిలర్ షకీరాబేగం అన్నారు. సంకల్ప్-2025 కార్యక్రమాన్ని నిడదవోలులోని మోడరన్ రూఫ్ ప్రభుత్వ బాలికల కళాశాలలో సోమవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన షకీరాబేగం మాట్లాడుతూ రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థినులు మంచి ఉత్తీర్ణత సాధించేందుకు సంకల్ప్ కార్యాక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంకల్ప్ ద్వారా ప్రత్యేక విద్యాబోధనను విద్యార్థినులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.గీతాంజలి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాక్‌వెల్‌లో మట్టి తొలగింపు

తాళ్లపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి తరచూ వచ్చే ఇబ్బందులు రూ.2.50 లక్షల ఖర్చుతో తొలగినట్లేనని ఏఈ సూర్యహాన్ తెలిపారు. 2016లో ఏర్పా టైన ఈ పథకంలో జాక్‌వెల్ మట్టితో నిండి పోయి తరచూ మోటార్లు పాడైపోతున్నా యని తెలుపగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్య నారాయణ ఆదేశాలతో గోదావరి నదికి సమీ పంలో ఉండే జాక్‌వెల్ లోపల పేరుకుపో యిన మట్టిని తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమాన్ని డీఈ ఎం.అప్పారావు పర్యవేక్షణలో పనులు పూర్తి చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యహాన్ తెలిపారు.